

ఉరుములా.. ఊరింపులా ?



ఎప్పటి మాదిరిగానే అంకెల గారడీ చేయబోతున్నారా..? వచ్చే ఎన్నికల ముందు రాష్ట్ర మధ్యంతర ఆర్థిక బడ్జెట్‌లో సరికొత్త సినిమా చూపించబోతున్నారా..? జగన్ సర్కార్ ఈసారి ఎలాంటి జిమ్మిక్కులు చేయబోతున్నది ? గుంతలు పడి ప్రాణాలు తీస్తున్న రహదారులకు రిపేర్లు చేస్తారా ? చుక్కనీరు అదనంగా సరఫరా చేయలేని సాగునీటి ప్రాజెక్టులకు కాస్తంత జీవం పోస్తారా..? లేదంటే జిమ్మిక్కులు చేయబోతున్నారా.. ఇప్పుడు ఉమ్మడి జిల్లాలో అందరిలోనూ ఇదే సందిగ్ధత. గడిచిన ఆర్థిక సంవత్సరాల్లో కేటాయింపులు, నిధుల విడుదలలో రకరకాల పద్ధతులు, పోకడలు అనుసరించారు. చివరికి వచ్చేసరికి బటన్ నొక్కుడులో అవేవీ కనిపించనే కనిపించలేదు.. మరి ఈసారి ఏం చేస్తారో ?

- పోలవరానికి అంతంత మాత్రమే కేటాయింపులు
- ఎత్తిపోతల పనులకు లెక్కల గొప్పే..పనులు సున్నా
- హార్బర్లు, రెగ్యులేటర్లకు కేటాయింపులు చేస్తారా
- నిర్వాసిత కుటుంబాలకు న్యాయం జరిగేదెప్పుడో
- ఎన్నికల వేళ బడ్జెట్‌తో సినిమా చూపిస్తారా
- నేటి మధ్యంతర వార్షిక బడ్జెట్‌పై జనం సందేహాలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

జగన్ సర్కార్ ఆరంభం నుంచి కడ దాకా నవరత్నాలకే ప్రాధాన్యం ఇస్తూ వచ్చింది. మిగతా వాటికి ఆర్థిక బడ్జెట్‌లో ఇచ్చే కేటాయింపులు మాత్రం అంకెల్లో ఘనం.. ఆచరణలో శూన్యం. ఈ తరహా పరిస్థితులను జనమంతా ప్రత్యక్షంగా అనుభవించారు. వార్షిక బడ్జెట్‌లో కేటాయింపులు ఎలా ఉన్నాయో విడుదలలోనూ అంతే మొత్తంలో నమోదయ్యేవి. ప్రత్యేకించి ప్రాధాన్యతా రంగాలకు సరికొత్త పద్దు ఇచ్చి అదే స్థాయిలో అందరూ మెచ్చేలా ఆసాంతం నిధుల కేటాయింపు జరిగేది. కాని రానురాను సీను మారింది.. అంకె తిరగబడింది. ప్రాధాన్యతా క్రమంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల కోసం గత వార్షిక బడ్జెట్‌లో ఏకంగా ఐదు వేల కోట్ల రూపాయలను బడ్జెట్‌లో చూపించారు. తీరా ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం మీద పోలవరం ప్రాజెక్టు పనులేవీ ముందుకు కదలనేలేదు. ప్రాజెక్టు పరిధిలో మిగిలిన పనులు ఆరంభం కాలేదు. దీనికి సంబంధించి ప్రత్యేకించి వైసీపీయేతర పక్షాలన్నీ గొంతెత్తి నినదించినా ఫలితం శూన్యం. పోలవరం ప్రాజెక్టుకు కేటాయింపులు ఘనంగా కనిపించినా చివరకు ఫలితం లేకుండా పోయింది. దీంతో గోదావరి పరివాహకంలో ఉన్న రైతులు, ఇతర జిల్లాల రైతాంగం ఉసూరుమన్నారు. ఇదే తరుణంలో గోదావరి జలాలతో మెట్ట ప్రాంతాన్ని తడిపే నిర్దిష్ట కార్యక్రమానికి తూట్లు పొడిచారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం కింద భూసేకరణ, కాలువ విస్తరణ పనులకు రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో 292 కోట్ల రూపాయలు పద్దు చూపించారు. పోలవరానికి పట్టిన గతే చింతలపూడి ఎత్తిపోతలది కూడా. విస్తరించిన పనులు ఒక్క అంగుళం కూడా కదలలేదు. రైతులకు చెల్లించాల్సిన పరిహారం అడ్రస్సు లేకుండా పోయింది. మరోవైపు తాడిపూడి ఎత్తిపోతల పథకానికి కాస్తంత జీవం పోసేందుకు 22 కోట్లు ఇచ్చేసినట్టు లెక్క చూపించారు. కాని ఈ ఎత్తిపోతల పనులు అంతంత మాత్రమే. ఈ తరహా ప్రాధాన్యతా రంగాలకు కేటాయింపులు ఘనంగా కనిపించినా వాస్తవానికి చేరుకునే సరికి అంతా తల్లకిందులే. మరి ఈసారి ఎన్నికల పద్దు కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం అంకెల రూపంలో ఎలాంటి జిమ్మిక్కులు చేయబోతుందో నేడు తేలబోతుంది. అంతకంటే మించి డెల్టా ఆధునికీకరణ పనులకు 12 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారు. చివరికి ఆ పనులకు టెండర్ పిలిస్తే కాంట్రాక్టర్ ముందుకొస్తే ఒట్టురైతులకు చేదోడు వాదోడుగా ఉండాల్సిన లాకులు మరమ్మతులు లేకుండా పోయాయి. ఆపరేషన్ మెయింటినెన్స్ కింద అరకొర నిధులు విదిల్చి చేతులు దులుపుకున్నారు. దీంతోపాటే ఎర్రకాలువ ఆధునికీకరణ పనుల నిమిత్తం 8.4 కోట్లు ఇచ్చినట్టే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఇలాంటి తరుణంలో ఇప్పుడు ప్రవేశపెట్టబోయే మధ్యంతర బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపు కేటాయింపు సంకేతాలు ఇవ్వబోతు న్నారు.. కేవలం ఓట్లు దండుకోవడానికి అంకెల గారడీ చేయబోతున్నారా అనే ప్రశ్న తలెత్తుతుంది.

అన్నీ వదిలేశారా ?

ఎప్పటిమాదిరిగానే ఈసారి కూడా చెప్పేదొకటి.. చేసేదొకటి. ఇచ్చిన మాటను గాలికొదిలేయడం, లేని గొప్పలు చెప్పడం, అంకెలు చూపించి అభివృద్ధి బాటలంటూ నమ్మించడం వైసీపీ సర్కారులో అలవాటుగా మారిందన్న అనేక మంది విమర్శలకు నిలువుటద్దంగానే ప్రభుత్వ వైఖరి ఉంటుంది. ప్రత్యేకించి పోలవరం నిర్వాసితులకు ఇస్తామన్న పరిహారం ఒకసారి కాదు.. పలు సందర్భాల్లో ముఖ్యమంత్రి నోట హామీగా వెలువడింది. గోదావరి వరదలు వచ్చినప్పుడు, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పర్యటించినప్పుడు నెలలతో సహా పరిహారం అందే సమయాన్ని ప్రకటించారు. క్యాలెండర్‌లు మారిపోతున్నా ఇప్పటికీ ఒక కొలిక్కిరాలేదు. ఇచ్చిన జీవో సైతం మసకబారింది. నిర్వాసితులకు ఇవ్వాల్సిన పరిహారం మాత్రం చేతికి అందనేలేదు. ఈసారి పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ఎలాంటి నిధులు కేటాయించ బోతున్నారు, నిర్వాసితులకు ఏ సాయం అందించాలని ప్రకటన చేయబోతున్నారనేదానిపైనే సస్పెన్స్ నెలకొంది. ఎన్నికల నామ సంవత్సరం కాబట్టి తూతూ మంత్రంగా ప్రకటించేసి చేతులు దులుపుకుంటారా, లేక ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారా అనేది తేలబోతుంది.



శంకుస్థాపన చేసిన పనుల మాటేంటి

ఇంకోవైపు నరసాపురం సమీపాన నిర్మించతలపెట్టిన ఫిషింగ్ హార్బర్ సంగతేం చేయబోతున్నారు. ఈ హార్బర్ నిర్మాణానికి ఆసాంతం రాష్ట్ర ప్రభుత్వమే ఖర్చు చేయాల్సి ఉంది. అంతలా నిధులు పైపైకి కేటాయిస్తున్నట్టు చూపిస్తూనే ఇంకోవైపు శంకుస్థాపన చేసి జనాలను ఊరిస్తున్నారు. ఈ మధ్యంతర బడ్జెట్‌లో ఈ తరహా పనులకు కేటాయింపులు ఉంటాయా అనేది అనుమానమే. అలాగే కొల్లేరులో ఉప్పునీరు కలవకుండా నిర్మించ తలపెట్టిన రెగ్యులేటర్లకు సంబంధించి నిధుల కేటాయింపు ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు అతి పెద్ద ప్రశ్న. రోడ్ల నిర్మాణానికి భారీ నిధులంటూ సంవత్సరాంతాన ఊదర గొట్టేశారు. అసలు విషయానికొస్తే తట్టెడు మట్టికి దిక్కులేదు. ప్రభుత్వానికి ప్రియాతి ప్రియమైన రైతుభరోసా కేంద్రాలు, సచివాలయ భవన నిర్మాణాల సంగతి పైపైకి ప్రచారం చేస్తూనే లోలోన నిధులు లేకుండా చేశారు. ఈ మధ్యంతర బడ్జెట్‌లో ఎలాంటి ఊరింపులు ఊరిస్తారో చూడాల్సిందే.



జంగారెడ్డిగూడెం కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్ల ఆవేదన

చిన్న చిన్న సమస్యలు పట్టించుకోకపోతే ఎలా

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 6 :

'మూడేళ్లుగా అదిగో ఇదిగో అంటున్నారే తప్ప ఒక్కపని ముందుకు వెళ్లడం లేదు. దీనిపై ప్రజలు మమ్మల్ని నిలదీస్తున్నారు. వారడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పండి. మూడేళ్లుగా నా వార్డులో ఒక్క సమస్య పరిష్కారం కాలేదు. కొన్ని వార్డుల్లో మాత్రం పనులు పరుగులు పెడుతున్నాయి. ఈ తేడా ఏమిటో అర్థం కావడం లేదు. ప్రజలు రద్దీగా తిరిగే రహదారిని తవ్వి నెలలు కావస్తున్నా నేటికీ పనులు జరగడం లేదు. వీటిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు'

అంటూ 21వ వార్డు కౌన్సిలర్ కంచర్ల గీతాకుమారి ఆవేదన వ్యక్తం చేశారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షతన మంగళవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గీతాకుమారి తన వార్డులో సమస్యను ప్రస్తావించారు. 'జేపీ సెంటర్ నుంచి త్రివేణి కాలేజ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా వున్న రోడ్డును తవ్వి నెలలు గడుస్తున్నా.. దీనిని నిర్మించేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో దీనిని అలానే వదిలేశారు. రమాదేవి హాస్పటల్ రోడ్డులోనూ ఇదే పరిస్థితి. అక్కడి ప్రజలు ఇబ్బందులు పట్టించుకోరా ? ఒక ఐరన్ కరెంట్ స్తంభానికి విద్యుత్ సరఫరా అయ్యి ప్రాణాపాయ పరిస్థితులు నెలకొన్నాయని అధికారులకు చెప్పినా ఇప్పటి వరకు పట్టించుకోలేదు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే ఎవరైనా చనిపోవాలేమో ?' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. 'ఆర్యవైశ్య కల్యాణ మండపం సమీపంలోని స్కూల్ డ్రైన్‌ను నిర్మించాలని ఏడాదిగా కోరుతున్నా పట్టించుకోలేదు' అంటూ సమస్యలను ఏకరవు పెట్టారు. వీటిపై అధికారులు, చైర్‌పర్సన్ చూద్దాంలే అని ఒక్క మాటలో తేల్చేసినట్టు వ్యవహరించారు. తన పట్ల వివక్షను మాని తల్లి స్థానంలో ఉన్న చైర్‌పర్సన్ అన్ని వార్డుల అభివృద్ధికి కృషి చేయాలని జనసేన కౌన్సిలర్ వలవల తాతాజీ కోరారు. తన వార్డులో సమస్యలపై ఎన్నోసార్లు అధికారులకు తెలిపినా పరిష్కారం కాలేదన్నారు. వార్డుల్లో ఏ కార్యక్రమం చేసినా సదరు కౌన్సిలర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమస్యలపై స్పందనలో పిర్యాదు చేయగలం కానీ అలా చేయకుండా మీ పట్ల గౌరవంతో ఉన్నామన్నారు. దీనికి చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ సమస్యలపై స్పందనలో ఫిర్యాదు చేసుకుంటే చేసుకోవచ్చునన్నారు.

ఈ సమస్యల మాటేంటి ?

- జంగారెడ్డిగూడెంలో మూడు రోజులకు ఒకసారి చెత్తను సేకరించడం వల్ల.. వార్డులన్నీ మురికి కూపాలుగా మారాయి. ఈ సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్ తాతాజీ కోరారు.
- కాలేజీ రోడ్డులో కల్వర్టు కుంగిపోయింది. దీనివల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నూతన కల్వర్టు నిర్మించాలని కౌన్సిలర్ నేట్రు సుబ్బలక్ష్మి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.
- సాలిపేట రోడ్డు పనులు జరగకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పనులను వెంటనే చేపట్టేలా చూడాలని కౌన్సిలర్‌లు లోకారపు వెంకటేశ్వరరావు, దొంతు మాధవ్ కౌన్సిల్‌లో అధికారులను కోరారు.
- ఎంతో కాలంగా తన వార్డులో తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అలాగే ఏ అభివృద్ధి పని జరగడం లేదు. లక్షలు మంజూరయ్యాయని చెప్పడమే తప్ప కాంట్రాక్టర్లు రారు, పనులు చేయరని ఒకటో వార్డు కౌన్సిలర్ వెంకటరమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరారు.
- పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు పెట్టిన అజెండా ప్రతిపాదనలను కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వైస్ చైర్ పర్సన్ ముప్పిడి వీరాంజనేయులు, కౌన్సిలర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఏవరు.. ఏమన్నారు

జగన్ బెదిరింపులు.. బాబు భరోసా

దెందులూరు సిద్ధం.. చింతలపూడి రా కదలిరా సభల వ్యత్యాసమిదే

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

దెందులూరు సిద్ధం సభలో సీఎం జగన్ ప్రసంగం చూసిన తర్వాత ఏలూరుకు చెందిన ఒక పెద్దాయన మాట్లాడుతూ 'ఓటేయకపోతే పెన్షన్ ఆగిపోద్దంటారేంటి ! అక్కడి కేదో ఈయనే సొంత డబ్బులు ఇత్తన్నట్టు ! గత పభుత్వం పెన్షన్ ఇచ్చింది ! ఇపుడీయన, రేపు వచ్చే పార్టీ కూడా ఇత్తాది. జగన్ ఏదో బెదిరించినట్లు మాటాడారు. ఏదైనా ఆ గొంతులో బెరుకు కనబడింది' అంటూనే రెండు రోజుల క్రితం చింతలపూడి రా.. కదలిరా సభలో చంద్రబాబు మాట్లాడిన తీరుపైన మాట్లాడారు. 'ఈ నాలుగున్నరేళ్లలో జగన్ ప్రభుత్వ అరాచకాలతో ఏ విధంగా ఇబ్బంది పడిందో బాబు జనంతోనే చెప్పించారు. అలాగే తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామో భరోసా ఇచ్చారు. ఇది కదా చెప్పాల్సింది అంటూ చెప్పుకొచ్చారు. ఈ రెండు సభలను జనం నిశితంగా గమనించారు.




నాకు ఓటేయకపోతే..

- నాకు ఓటేయకపోవడం అంటే సంక్షేమ పథకాలు వద్దనుకున్నట్లే.
- పెన్షన్ ఇంటికి రావాలంటే నేను సీఎంగా ఉండాలి. భవిష్యత్తులో పెన్షన్లు పెరగాలంటే ఈ ప్రభుత్వమే రావాలి.
- నేను రాకుంటే నేను ఏర్పాటు చేసిన 56 కార్పొరేషన్లు ఉండవు.
- పథకాల లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ నా స్టార్ క్యాంపెయినర్‌గా పనిచేయాలి.
- ప్రతి ఒక్కరూ నా మాటగా వంద మంది ఇళ్లకు వెళ్లి ఓట్లేయించండి.

2019లో వైసీపీ అధికారం చేపట్టినప్పటి నుంచి ఆ ప్రభుత్వం, నాయకులకు తెలిసింది బెదిరించడం మాత్రమే. వలంటీర్ల వ్యవస్థను ప్రజలపై ప్రయోగించి ప్రతీ క్షణం నిఘా పెట్టి బెదిరిస్తూనే ఇన్నాళ్లు పాలించింది. ఎన్నికల సమయంలోనూ అదే హెచ్చరికల రాజకీయంతో ఓట్లు దండుకోవాలని ప్రయత్నిస్తోంది. దెందులూరు సిద్ధం సభలో జగన్ ఏమైనా హామీలు ఇస్తారేమోనని ఆశించింది. కానీ, ఆ ప్రయత్నం జరగలేదు. పెండింగ్ ప్రాజెక్టులపైన ఎలాంటి ప్రస్తావన లేదు. ప్రసంగం ఆసాంతం చంద్రబాబు, పవన్‌ను తిట్టడం, ఆయన అడుగులకు మడుగులు ఒత్తని మీడియాపై దుమ్మెత్తిపోయడమే పనిగా మాట్లాడారు.

ఏమి చేశారు ?

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెడికల్ కాలేజీ మినహా ఐదేళ్లగా ఏలూరు జిల్లాకు వైసీపీ చేసిన అభివృద్ధి ఏమీ లేదు. గడిచిన పదవీ కాలంలో రోడ్లు వేయాలన్న విషయం మరచి పోయిన ప్రజా ప్రతినిధులు ఇవాళ ఉన్నట్లుండి ఏలూరు కార్పొరేషన్ నిధులతో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేస్తున్నారు. ఆ రోడ్లు కాస్తా ఎన్నికల సమయానికి పూర్తయ్యే పరిస్థితి లేదు. అయినా సరే రాజకీయ ఆర్భాటం ప్రదర్శిస్తోన్న ఓటు బ్యాంకు రాజకీయం చేస్తున్నారని మంగళవారం జరిగిన శంకుస్థాపనలు స్పష్టం చేస్తున్నాయి. విలీన గ్రామాల్లో నేటికీ శుద్ధి చేసిన తాగునీటికి దిక్కులేదు. నేటికీ చాలా గ్రామాలు సుద్ద కలిసిన నీటినే పట్టుకుని, వడపోసి వాడుకుంటున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ నిధుల నుంచే గాక ఆర్థిక సంఘం నుంచి గడిచిన ఐదేళ్లు వందల కోట్ల నిధులు ఏలూరు జిల్లాకు వరుస కట్టినా ఒక్క అభివృద్ధిని ప్రజలకు అందించలేకపోయారు. ఏలూరు నగరానికి భూగర్భ డ్రైనేజి వ్యవస్థను ఐదేళ్లు గడుస్తున్నా కనీసం ప్రతిపాదనలపై రాష్ట్ర పెద్దలతో చర్చలు జరపలేక జిల్లా నాయకత్వం విఫలమైంది. జంగారెడ్డిగూడెంలో కల్తీ సారా కోరల్లో చిక్కుకుని 27 మంది అభాగ్యులు కన్ను మూస్తే, నేటికీ చర్యలు తీసుకోలేని పరిస్థితి. ఏలూరులో వింత వ్యాధి ప్రబలి ప్రజలు మంచానపడితే ఇంత వరకు కారణాలు వెల్లడికాలేదు. నడిరోడ్డున ఓ మహిళపై యాసిడ్ దాడి, పోలీసు పంచాయతీ కబంధహస్తాల్లో పడి యువకుడి ఆత్మహత్య వంటి వ్యతిరేకతల నడుమ దెందులూరులో సభ పెట్టి, ఓటర్లను ఆకర్షించాలనే ఉద్దేశం పట్టని సీఎం బెదిరింపుల పర్వానికి దిగడం చర్చనీయాంశంగా మారింది.



మేం అధికారంలోకి రాగానే

- పేదలకు 2 సెంట్ల ఇంటి స్థలమిస్తాం.
- టిడ్కో ఇళ్లను నిర్మిస్తాం.
- రైతుకు అన్నదాత పథకం కింద రూ.25 వేలు అందిస్తాం.
- ప్రతీ ఇంటికి 24/7 మంచి నీటి సరఫరా.
- మామిడికి రీసెర్చ్ పార్క్ ఏర్పాటు.
- ఆక్వా రైతుకు ప్రతీ విద్యుత్ యూనిట్‌ను రూ.1.50లకు అందించి ప్రోత్సహిస్తాం.
- ఏడాదికి 4 లక్షల చొప్పున ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తాం.
- ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి నెలకు రూ.1500లను ఆడబిడ్డ నిధిగా ఖాతాల్లో వేస్తాం.
- తల్లికి వందనం పేరిట ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా రూ.15 వేలు ఇస్తాం.
- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి సూపర్ సిక్స్‌తో టీడీపీ - జనసేన మీ భవిష్యత్తుకు అండగా ఉంటుంది.
- త్వరలోనే ఎన్నికల మేనిఫెస్టో కింద బీసీలకు ప్రత్యేక సబ్ ప్లాన్, రక్షణ చట్టాన్ని ప్రవేశపెడతాం.
- మూడు నెలలు పింఛను తీసుకోకపోయి నా సరే ఇంటికొచ్చి మరీ పింఛన్ అందించేలా చర్యలు తీసుకుంటాం.

సర్పంచ్‌లకు ఏదీ గౌరవం

- పంచాయతీలను పట్టించుకోని జగన్ సర్కార్
- కేంద్ర నిధులు సైతం తన ఖాతాల్లోకి మళ్లింపు
- వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ రాకతో గుర్తింపు కరువు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 6 : ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన ప్రజా ప్రతినిధులన్న కనీస గౌరవం ఇవ్వకపోయినా జగన్ ప్రభుత్వం తమను ఎన్ని విధాలుగా అవమానించినా, ఉత్సవ విగ్రహాలుగా మార్చేసినా ఇన్నాళ్ళు భరించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తమపైనే పెత్తనం చేస్తున్నా కనీస మర్యాద ఇవ్వకున్నా సహించారు. పంచాయతీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్ళిస్తే, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు లేక ఎన్నుకున్న ప్రజల ముందు తలెత్తుకోలేక తీవ్ర అవమానభారాన్ని మోశారు. ఈ నేపథ్యంలో సర్పంచ్‌లు ఎప్పటికప్పుడు ఉద్యమాలను చేపట్టి జగన్ సర్కార్ చర్యలను ఖండిస్తూనే ఉన్నారు. తాజాగా వారు చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని ఎంచుకున్నారు. తమ డిమాండ్‌లను సర్కార్ ముందుంచే ప్రయత్నం చేశారు. పూర్తి స్థాయిలో ప్రభుత్వం వాడేసుకున్న 14, 15వ ఆర్థిక సంఘాల నిధులను పంచాయతీలకు చెల్లించాలి. పంచాయతీల్లోని సచివాలయాలను పంచాయతీల పరిధిలోకి తీసుకురావాలి. ఇప్పటి వరకు మళ్లించిన రూ.3,886 కోట్ల నిధులను పంచాయతీలకు జమ చేయాలి. విద్యుత్ చార్జీలను ప్రభుత్వమే చెల్లించాలి. రావాల్సిన రూ.2030 కోట్ల ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు జమ చేయాలి. సచివాలయ కన్వీనర్ల వ్యవస్థలను రద్దు చేయాలి. సర్పంచ్‌లకు రూ.15 వేలు, ఎంపీపీ, జడ్పీటీసీలకు రూ.30 వేలు గౌరవ వేతనం చెల్లించాలి వంటి పలు డిమాండ్లతో సమరశంఖం మోగించారు.

సర్పంచ్‌ల చలో అసెంబ్లీ.. పలువురి అరెస్ట్

పంచాయతీలకు కేటాయించిన కేంద్ర ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత ప్రయోజనాలకు వాడటంపై తీవ్ర అసంతృప్తితో వున్న సర్పంచ్‌లు మంగళవారం అసెంబ్లీని ముట్టడించారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల సర్పంచ్‌ల ఛాంబర్, సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున సర్పంచ్‌లు అమరావతి తరలివెళ్లారు. దీనికి అనుమతి లేదని, ఎవరూ వెళ్లవద్దని పోలీసులు హెచ్చరికలు జారీ చేసి కొందరిని సోమవారం రాత్రి నుంచే అదుపులోకి తీసుకున్నారు. కొందరిని గృహ నిర్బంధం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లవద్దని సర్పంచ్‌లను హెచ్చరించినప్పటికీ చాలామంది మంగళ వారం తాడేపల్లి చేరుకుని అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. అక్కడ పోలీసులు సర్పంచ్‌లను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారని ఉభయ గోదావరి జిల్లా సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు కడలి గోపాలరావు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం తమను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమ్మ పెట్టదు అడుక్కు తిననివ్వదు అన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు నిధులు ఇవ్వకపోగా కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లించడంపై మండిపడ్డారు. ఇదే సమయంలో అక్కడ ముట్టడికి యత్నిస్తే సర్పంచ్‌లను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారని తెలిపారు. జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు మాట్లాడుతూ 'సమస్యల కోసం పోరుబాట పడితే సర్పంచ్‌లను అరెస్ట్ చేయటం దుర్మార్గం. ఈ రోజు చీకటి రోజు సీఎం జగన్మోహన్‌రెడ్డి మూల్యం చెల్లించుకోక తప్పదు. బ్రిటీష్ పాలన, హిట్లర్‌కంటే జగన్ పాలనలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాన్ని ఎలా చేపడతాం' అంటూ మండిపడ్డారు.



అసెంబ్లీ ముట్టడిలో భాగంగా సర్పంచ్‌ల ఆందోళన

సిమెంట్ బస్తాలు అమ్ముకున్న హెడ్మాస్టర్ సస్పెన్షన్ !

ఏలూరు ఎడ్యుకేషన్/చింతలపూడి, ఫిబ్రవరి 6: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల నిమిత్తం చేపట్టిన నాడు-నేడు పనులకు పంపిణీ చేసిన సిమెంట్ బస్తాలను పక్కదోవ పట్టించి విక్రయించారన్న అభియోగాలు రుజువు కావడంతో చింతలపూడి మండలం రాఘవాపురం జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం కె.రామకృష్ణను సస్పెండ్ చేసినట్టు డీఈవో పి.శ్యాంసుందర్ తెలిపారు. సిమెంట్ బస్తా ఒక్కింటికి రూ.135 చొప్పున ప్రైవేటు వ్యక్తులకు స్కూలు ప్రధానోపాధ్యాయుడు విక్రయించినట్టు సోషల్ మీడియాలో వచ్చిన సమాచారంపై కలెక్టర్ ఆదేశాల మేరకు తాను, ఎంఈవో విచారణ జరిపామన్నారు. విచారణలో హెచ్‌ఎం అవినీతి రుజువు కావడంతో రామకృష్ణను సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (కాకినాడ ఆర్జేడీ) మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు.

రేపు షర్మిల దెందులూరు రాక

దెందులూరు, ఫిబ్రవరి 6 : పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల గురువారం దెందులూరులో పర్యటించనున్నట్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డీవీఆర్‌కే చౌదరి తెలిపారు. మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం సాయంత్రం ఐదు గంటల నుంచి కొవ్వలి అడ్డరోడ్డు నుంచి కొవ్వలి మీదుగా దోసపాడు, ఉండ్రాజవరం అడ్డరోడ్డు మీదుగా పోతునూరు వస్తారు. ఇక్కడ వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి బహిరంగ సభలో మాట్లాడతారని తెలిపారు.

జిల్లా వ్యవసాయాధికారిగా బాషా

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 6: జిల్లా వ్యవసాయ శాఖాధికాధికారి వై.రామకృష్ణను బాపట్ల జిల్లా వ్యవసాయశాఖాధికారిగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో షేక్ హబీబ్ బాషాను జిల్లా వ్యవసాయాధికారిగా నియమించారు.

తప్పుల తడకగా ఓటర్ల జాబితా

▸ పడమరవిప్పర్రులో తొలగించని మృతుల ఓట్లు ▸ మరికొన్ని డబుల్ ఎంట్రీల నమోదు

పెంటపాడు, ఫిబ్రవరి 6 : పడమరవిప్పర్రు గ్రామంలోని 188వ పోలింగ్ కేంద్రంలో ఓటర్ల జాబితా అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పట్టేలా ఉంది. ఈ పోలింగ్ కేంద్రంలో 11 మంది చనిపోయి ఏళ్ల గడుస్తున్నా నేటికి ఓట్ల తొలగింపు చేయలేదు. డబుల్ ఎంట్రీలు కూడా ఈ పోలింగ్ కేంద్రంలో అధికంగా కనిపించాయి. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన కొంతమంది జనసేన నాయకులు విలేకర్ల దృష్టికి తీసుకువచ్చారు. ఈ పోలింగ్ బూత్‌లో చినిమిల్లి రామచంద్రరావు, పొట్నూరి కనకదుర్గ, రేవూరి లక్ష్మీ, బాసంసెట్టి వెంకటేశ్వరరావు, బాయిశెట్టి రామతులసమ్మ, బాయిశెట్టి రాజీవ్‌గాంధి, బాయిశెట్టి కృష్ణమూర్తి, రాచకొండ సుబ్బారావు, కుప్పిల కృష్ణవేణి, బాయిశెట్టి వీవీ గోపాలరావు, మానె సత్యనారాయణ చనిపోయి చాలా సంవత్సరాలు గడుస్తున్నా నేటికి వీరి ఓట్లను అధికారులు పదిలంగా ఉంచారు. ఇదే పోలింగ్ కేంద్రంలో డబుల్ ఎంట్రీలు తారసపడ్డాయి. గొల్ల కోటి వీరమణికంఠ అనే వ్యక్తికి 188వ పోలింగ్ కేంద్రంలో వరుస సంఖ్య 26, 185 లో ఓటు ఉంది. పసల ఉమాసతీష్‌కు ఇదే కేంద్రంలో వరుస సంఖ్య 200, 341లో ఓటు ఉండగా షేక్ రహీం అనే వ్యక్తికి వరుస సంఖ్య 41, 42లో ఓట్లు ఉన్నాయి.



డబుల్ ఎంట్రీగా నమోదైన షేక్ రహీం పేరు



ఓటర్ల జాబితాలో కొంతమంది మృతుల పేర్లు

ముందస్తు సమాచారం లేకుండా

రోడ్డు మూస్తే ఎలా ?

▸ బ్రాహ్మణ చెరువు ప్రధాన రహదారి ఆకస్మిక మూసివేతతో ఇబ్బందులు

▸ వీరవాసరం శివారు, పాలమూరు వద్ద సీసీ రోడ్ల నిర్మాణం

పెనుమంట్ర, భీమవరం టౌన్, ఫిబ్రవరి 6 : డెల్టాలో నిత్యం ఆర్టీసీ సర్వీసులు, వాహనాలతో రద్దీగా ఉండే రహదారి వీరవాసరం- బ్రాహ్మణ చెరువు రోడ్డు. 12 కిలోమీటర్లు పొడవున్న ఈరోడ్డులో వీరవాసరం శివారు, పాలమూరు గ్రామ ప్రారంభంలో సిమెంట్ రోడ్డు పనులు నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో ఈ రహదారి మూసివేశారు. రోడ్డు మూసివేస్తు న్నట్టు ముందస్తు సమాచారం లేకపోవడంతో రెండు రోజులుగా ప్రయాణికు లు అవస్థలు పడుతున్నారు. మంగళవారం నవుడూరు సెంటర్‌లోను, బ్రాహ్మణ చెరువు సెంటర్ వద్ద కనీసం వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేకుండా మట్టిగుట్టలు అడ్డుకట్ట వేయడంతో వందలామంది ప్రయాణికులతో పాటు నిత్యం కాలేజీలకు వెళ్లే విద్యార్థులు కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్న సమయంలో ముందస్తు సమాచారం లేకుండా రోడ్డు మూసివేతతో ఇబ్బందులు తప్పడం లేదు. సోమవారం భీమవ రం నుంచి రాజమండ్రి వెళ్లే వాహనాలను పూర్తయిన ఒకవైపు సిమెంట్ రోడ్ నుంచి అనుమతించారు. ఇది ఇబ్బందికరంగా ఉంటుందంటూ పూర్తిగా నిలిపివేశారు. ఈ సమస్య దాదాపు 26 రోజుల పాటు కొనసాగడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా వేండ్ర మీదుగా నవుడూరు నుంచి నెలమూరు మీదుగా ఆలమూరు నుంచి రాజమండ్రి వైపు బస్సులు నడిపితే ప్రయాణికులకు కొంతైనా కష్టాలు తగ్గుతాయని పలువురు కోరుతున్నారు.


నవుడూరు సెంటర్‌లో పాలమూరు వైపు రోడ్డుకు అడ్డంగా వేసిన మట్టిగుట్టలు


పాలమూరులో సిమెంట్ రోడ్డు వేస్తున్న దృశ్యం


20 రోజుల పాటు మూసేస్తున్నాం : ఇన్‌చార్జి ఏఈ యశ్వంత్

బ్రాహ్మణ చెరువు- వీరవాసరం సీసీ రోడ్డు నిర్మాణం కారణంగా 20 రోజులు పాటు మూసివేస్తున్నట్టు ఆర్అండ్‌బీ ఇన్‌చార్జి ఏఈ ఎ.యశ్వంత్ తెలిపారు. అత్యవసర వాహనాలను మాత్రమే అనుమతిస్తామన్నారు. ఇప్పటికే ఏపీఎస్ ఆర్టీసీ, పోలీస్ శాఖకు రోడ్డు మూసివేస్తున్నట్టు సమాచారం ఇచ్చామని, మీడియాలో గాని సోషల్ మీడియాలో గాని రోడ్డు మూసివేస్తున్నట్టు సమాచారం ఇవ్వకపోవడం వాస్తవమేనన్నారు.

10 నుంచి బాలబాలికల క్రికెట్ ఎంపిక పోటీలు

ఏలూరు స్పోర్ట్స్, ఫిబ్రవరి 6: వెస్ట్ గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 13 నుంచి 16 ఏళ్ల జిల్లాస్థాయి బాల బాలికలకు క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ కార్యదర్శి వి.వి.ఎస్.ఎన్ శ్రీనివాసరాజు, అధ్యక్షుడు జి.ఆదిత్యవర్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలు ఏలూరు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, తణుకు, తాడేపల్లిగూడెం, కొవ్వూరు, నిడదవోలు ప్రాంతాల వారికి నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు సెప్టెంబరు ఒకటో తేదీ 2023 నాటికి జన్మించిన బాలబాలికలు అర్హులన్నారు. ఈనెల 10,11వ తేదీల్లో ఏలూరు వైద్యుల కళాశాల మైదానంలో ఎంపికలు నిర్వహిస్తామని, ఈనెల 12న భీమవరం డీఎన్ఆర్ కళాశాల మైదానంలో ఎంపికలు నిర్వహిస్తామని తెలిపారు. క్రీడాకారులు సొంత కిట్‌లు తెచ్చుకోవాలన్నారు. వీటితో పాటు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని వివరాలకు 94939 62833 నంబరులో సంప్రదించాలన్నారు.

11న జాతీయ తెలుగు సాహిత్య సదస్సు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, తదితరులు

ఏలూరు కల్చరల్, ఫిబ్రవరి 6 : ప్రపంచంలోనే అతిపెద్ద సాహిత్య సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ శ్రీశ్రీ కళావేదిక ప్రతినెల నిర్వహించే సాహితి ప్రభంజనంలో భాగంగా ఈనెల 11న జాతీయ తెలుగు సాహిత్య సదస్సు, కవిసమ్మేళనం నిర్వహిస్తున్నట్టు కళావేదిక ఏలూరు జిల్లా కమిటీ అధ్యక్షుడు శ్రీహరికోటి తెలిపారు. కొయ్యలగూడెంలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో సాహితీరత్న కొల్లి రమావతి సారథ్యంలో సదస్సు జరుగుతుందన్నారు. కార్యక్రమానికి సంబంధించి బ్రోచర్‌ను రాష్ట్రసాహిత్య అకాడమి ఛైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్ర మంలో ఎస్.కస్తూరిరావు, ఎం.జె సుజయ్‌కృష్ణ, గోరింత ఐజాక్, శ్యామల, టి.వెంకటేశ్వరరావు, ఉమాశైలజ తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యాన విద్యలో మెలకువలు ముఖ్యం'


కంప్యూటర్‌లో మెలకువలు నేర్పుతున్న ఐటీ నిపుణులు

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 6 :ఉద్యాన విద్యలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు పాటించాల్సిన మెలకువలపై వర్క్‌షాపు నిర్వహణ అభినందనీయ మని ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ తెలిపారు. వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో మంగళవారం మిశ్రమ జ్ఞానార్జన వేదిక రెండు రోజుల వర్క్‌షాపు ముగింపు సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసీఏఆర్, భారతీయవ్యవసాయ ప్రకారం పరిశోధనా సంస్థ నుంచి వచ్చి ఐటీ నిపుణులు విద్యార్థులకు ప్రణాళికా బద్ధమైన విద్యావిధానం, ఆన్‌లైన్ బోధనా సాధనాలపై వివరించారు. డీన్ ఆఫ్ హార్టీకల్చర్ ఏఎస్ పద్మావతమ్మ, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ ఎస్.సూర్యకుమారి పాల్గొన్నారు.

గురుకులంలో ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 6: పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో (ఇంగ్లీష్ మీడియం)లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి.రాజారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరంలో నాలుగో తరగతి చదివి 2015 ఆగస్టు 31లోగా జన్మించిన బాలురు అర్హులని వివరించారు. ఈనెల 23వ తేదీ లోపు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

లారీని ఢీకొట్టిన కారు.. డీటీకి గాయాలు



తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 6: తాడేపల్లిగూడెం నిట్ కళాశాల సమీపంలో ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయ డీటీ పోతురాజు స్వల్పగాయాలతో బయటపడ్డారు. తాడేపల్లిగూడెంలో నివాసం ఉండే ఆయన విధులు నిర్వహించేందుకు కారులో బయల్దేరగా ఏపీ నిట్ సమీపంలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. కారు ముందుభాగం దెబ్బతింది. ఈ ప్రమాదంలో ఆయనకు స్వల్పగాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుధాకరరెడ్డి తెలిపారు.

48 గంటల్లోనే నిందితుడి అరెస్టు.. సొమ్ము రికవరీ


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 6: నూజివీడు ఐటీఎస్ కంపెనీ కార్యాలయంలో నగదు చోరీ కేసులో నిందితుడిని నూజివీడు పట్టణ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. నూజివీడు డీఎస్పీ ఈ.అశోక్‌కుమార్ గౌడ్ తెలిపిన వివరాలివి.. నూజివీడు ఐటీఎస్ టెక్నో ఢ్యూ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఆదివారం బీరువా పగులకొట్టి నగదు చోరీ అయినట్టు కంపెనీ అకౌంటెంట్ రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నూజివీడు పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి దర్యాప్తు చేపట్టి నూజివీడు మండలం తుక్కులూరు గ్రామానికి చెందిన కాగితాల జోసఫ్‌రాజును అరెస్ట్‌చేసి అతడి నుంచి రూ.90 వేలు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. నేరం జరిగిన కేవలం 48 గంటల్లోనే నిందితుడిని అదుపులోకి తీసుకోవడంపై నూజివీడు పట్టణ పోలీసులను డీఎస్పీ అభినందించారు.

దూడను చంపిన పెద్దపులి

▸ ఉడతపల్లి గ్రామంలో ఘటన.. ఆయా ప్రాంతాల్లో స్థానికుల భయాందోళన

ఉమ్మడి గోదావరి జిల్లా వాసులకు రెండు వారాలుగా కంటిమీద కునుకులేకుండా చేసిన పెద్దపులి సంచారం మంగళవారం పోలవరం మండలం ఉడతపల్లి గ్రామంలో ఆవుదూడపై దాడి చేయడంతో మళ్లీ కలకలం మొదలైంది. ఏజెన్సీలోని మన్యం ప్రాంతం నుంచి ఓ పెద్దపులి బయట ప్రాంతాలకు వచ్చి ద్వారకాతిరుమల, గోపాలపురం, బుట్టాయగూడెం మండలాల్లోని పశువులపై దాడులు చేసి చంపి తిన్న సంగతి తెలిసిందే. రెండు రోజుల క్రితం బయటకు వచ్చిన దారిమీదుగానే పాపికొండల అభయారణ్యం వైపుగా మన్యం ప్రాంతానికి పులి చేరుకుంది అని అటవీశాఖ అధికారులు స్పష్టం చేశారు. దీంతో పులి సమస్య తీరినట్టేనని భావించిన ప్రజలందరూ ఊపిరిపీల్చుకునే లోపు మళ్లీ సమస్య వెంటాడుతోంది.

పోలవరం, ఫిబ్రవరి 6 :

పోలవరం మండలం ఉడతపల్లి గ్రామంలో చుండ్రు వీరాయమ్మకి చెందిన ఆవుదూడపై పెద్దపులి దాడి చేసి మంగళవారం చంపింది. ఆ గ్రామ గిరిజనులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా ప్రాంతానికి వెళ్లి అధికారులు పరిశీలించి దాడి చేసింది పులేనని ధ్రువీకరించారు. ఈనెల 4వ తేదీ అర్ధరాత్రి బుట్టాయగూడెం మండలం కొవ్వాడలో ఆవుపై దాడి చేసిన అనంతరం పాపికొండల అభయారణ్యంలోకి పులి వెళ్లినట్టు ధ్రువీకరించిన అధికారులు ఉడతపల్లిలో దాడి చేసింది ఆ పులేనని స్పష్టం చేశారు. పోలవరం మండలంలో ఉడతపల్లి, మెత్తప్పకోట, సున్నాలగండి గ్రామాల ప్రజలు, జిల్లెల్లగూడెం పంచాయతీ పరిధిలో గ్రామాల్లో, పోలవరం మండల పరిధి గ్రామాల్లో ప్రజలు అడవుల్లోకి వెళ్లరాదని, పశువులను అడవుల్లో మేపరాదని, రాత్రిపూట బయట తిరగరాదని అటవీ క్షేత్రాధికారి ఎస్.దావీదురాజు హెచ్చరించారు. పులి దాడిలో మృతి చెందిన ఆవుదూడకు పశువైద్యాధికారిచే పోస్టుమార్టం నిర్వహించి సంబంధిత యజమానికి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. పులి సంచరిస్తున్న సమాచారం ప్రచారంలోకి రావడంతో ఆయా గ్రామాల ప్రజలు భయందోళనలకు గురవుతున్నారు.


చనిపోయిన ఆవుదూడను పరిశీలిస్తున్న అధికారులు

క్రైం కార్నర్

పాలుపోసి వస్తుండగా కారు ఢీకొని ఒకరి మృతి


కారు ఢీకొట్టిన ప్రమాద దృశ్యం

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 6:లక్ష్మీపురం-రెడ్డిగూడెం గ్రామాల మధ్య మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోపల వెంకటరెడ్డి (32)అనే కొండరెడ్డి గిరిజనుడు మరణించాడు. ఎస్ఐ కె.వెంకన్న తెలిపిన వివరాలివి.. రెడ్డిగూడెంకు చెందిన అతడు ఉదయం పూట లక్ష్మీపురంలో బంధువులకు పాలు పోసేందుకు ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి గ్రామానికి వస్తుండగా రాజానగరం వైపుగా వస్తున్న వాహనం వేగంగా వచ్చి ఢీ కొంది. 108లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. భార్య అమ్మాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ పోలీసుల అదుపులో ఉన్నట్ట సమాచారం. గ్రామంలో అతడి మరణంతో కుటుంబస భ్యులు కన్నీరుమున్నీరుగా విలపించడం అందరిని కంటతడి పెట్టించింది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 6 :విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అంతర్వేదిగూడెంకు చెందిన కొవ్వాసు రాజ్‌కుమార్(23) సోమవారం అర్ధరాత్రి మరణించినట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి జీలుగుమిల్లి మండలం గంగన్నగూడెంకు చెందిన యువతితో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఈ విషయం అమ్మాయి తల్లిదండ్రులు, బంధువులకు తెలియడంతో అమ్మాయిని మందలించారు. ఈ మేరకు యువకుడు మనస్తాపంతో ఈనెల 4న జీడితోటలో పురుగుల మందు తాగాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు అంతర్వేదిగూడెం పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి, ఏలూరు ప్రభుత్వాసుపత్రికి ఆ తరువాత మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ కృష్ణంరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 6 : ఏలూరు సమీపంలోని 16వ నంబరు జాతీయ రహదారి రత్నాస్ హోటల్ ఎదురుగా రోడ్డుపై నడిచి వెళ్తున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం మంగళవారం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాలివి.. సుమారు 30 నుంచి 40 ఏళ్ల వయస్సు గల వ్యక్తి హైవేపై ఆశ్రం వైపు నుంచి విజయవాడ వైపు నడిచి వెళ్తుండగా మంగళవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో మృతి చెందాడు. ఈ సమాచారం రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డికి అందడంతో ఏఎస్ఐ దానం తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు ఎరుపు రంగు శరీరంతో, జీన్ ప్యాంటు, టీషర్టు ధరించి ఉన్నాడు. జేబులో ఎటువంటి ఆధారాలు లభించలేదు. ఆ వ్యక్తి అసలు ఎందుకు వచ్చాడు. ఎక్కడికి నడిచి వెళ్తున్నాడు, జేబులో ఎలాంటి వస్తువులు లేకపోవడం ఏమిటనే అన్ని కోణాల్లో పరిశీలన చేస్తున్నారు. ఈ ఘటపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

వివాహిత ఆత్మహత్య


సాయి వెంకట రాజ్యలక్ష్మి మృతదేహం

పెదపాడు, ఫిబ్రవరి 6 : పెదపాడు మండలం అప్పనవీడులో ఓ వివాహిత అనుమానస్పదస్థితిలో ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివి.. కృష్ణాజిల్లా బాపులపాడుకు చెందిన రౌతు వెంకట బాల మాణిక్యాలరావుకు భద్రాచలంకు చెందిన వెంకటసాయి రాజ్యలక్ష్మితో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక పాప ఉంది. భార్యభర్తల మధ్య తగాదా నేపథ్యంలో భార్యను వదిలి వెళ్లిపోవడంతో రాజ్యలక్ష్మి అప్పనవీడులోని అద్దె ఇంటిలో నివాసముంటూ స్థానికంగా ఉద్యోగం చేస్తుంది. ఆరు నెలల క్రితం భర్త మాణిక్యాలరావు భార్య వద్దకు వచ్చి, కొద్దిరోజులకే మళ్లీ వదిలి పోయాడు. ఈ నేపథ్యంలో మనస్తాపం చెందిన రాజ్యలక్ష్మి మంగళవారం ఇంట్లోనే ఉరి వేసుకుంది. సమాచారం అందుకున్న పెదపాడు ఎస్ఐ శుభశేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతిరాలి తమ్ముడు రామినేని శివరామకృష్ణ ఫిర్యాదు మేరకు పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో ఒకరి మృతి

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 6:పాముకాటుతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన రాచన్నగూడెంలో జరిగింది. కుక్కునూరుకు చెందిన వాసు(47) కొద్ది రోజుల క్రితం రాచన్నగూడెంలో పొగాకు బ్యారన్ వద్ద పనుల కోసం ఓ రైతు వద్దకు మకాం వచ్చాడు. మూడు రోజుల క్రితం పాముకాటుకు గురయ్యాడు. అతడిని తెలంగాణ రాష్ట్రం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్టు గ్రామస్థులు తెలిపారు. ఈ విషయమై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఉరివేసుకుని వ్యక్తి మృతి

భీమవరం క్రైం, ఫిబ్రవరి 6 : భీమవరం వన్‌టౌన్‌లోని నల్లవారితోటలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి.. జె.నాగరాజు (30) సోమవారం రాత్రి ఇంటికొచ్చిన తరువాత స్నానానికి వెళ్ళి ఇంటి లోపలికి ఎంతసేపటికి రాలేదు. అనుమానం వచ్చిన అతడి భార్య దుర్గామల్లేశ్వరి ఇంటి వెనక్కి వెళ్లి చూడగా వేపచెట్టుకు వేలాడుతున్నట్టు కనిపించింది. వీరికి పన్నెండేళ్ల క్రితం వివాహం కాగా పిల్లలున్నారన్నారు. భార్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రైల్వే ఉద్యోగిపై చీటింగ్ కేసు

▸ ఉద్యోగాలు ఇప్పిస్తానని నగదు వసూలు చేసిన వైనం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 6 : రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని లక్షల రూపాయలు తీసుకుని మోసగించడంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీటౌన్ పోలీసులు ఒక రైల్వే ఉద్యోగిపై చీటింగ్ కేసు మంగళవారం నమోదు చేశారు. ఏలూరు సత్రంపాడుకు చెందిన పెందుర్తి విక్టర్‌బాబు రైల్వేలో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఏలూరుకు చెందిన చెన్నంశెట్టి సకోబాయ్ తన కుమార్తెకు, తన బంధువుల్లోని ఒక యువకుడికి రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని విక్టర్‌బాబు నమ్మబలికాడు. సకోబాయ్ నుంచి 13 లక్షల 50 వేల రూపాయలు తీసుకుని ఇప్పటివరకూ ఇవ్వలేదు. ఉద్యోగం కూడా ఇప్పించలేదు. ఆమె అడిగినప్పటికీ ఒక్క పైసా కూడా ఇవ్వకుండా కాలయాపన చేస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితురాలు ఏలూరు త్రీటౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయడంతో విక్టర్‌బాబుపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజిలెన్స్ దాడులు.. రేషన్ బియ్యం స్వాధీనం

ఏలూరు క్రైం/కొయ్యలగూడెం, ఫిబ్రవరి 6 : జిల్లాలోని నూజివీడు మండలం జంగంగూడెంలోనూ, కొయ్యలగూడెం మండలం కన్నాపురంలోనూ విజిలెన్సు అధికారులు మంగళవారం దాడులు నిర్వహించి రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ ఆదేశాల మేరకు విజిలెన్సు సీఐ పి.శివరామకృష్ణ, నూజివీడు సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ జి.వెంకటేశ్వరరావు, వారి సిబ్బంది కలిసి నూజివీడు మండలం జంగంగూడెంలోని తొమ్మండ్రు రమేష్ నిల్వ ఉంచిన రేషన్ బియ్యం గొడౌన్‌పై దాడి చేశారు. 43.50 క్వింటాళ్ళ రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అతడు ఆ గ్రామ చుట్టుపక్కల ప్రాంతంలో కేజీ రూ.13కు కొనుగోలు చేసి పెదపాడు మండలం దాసరిగూడెంనకు చెందిన మల్లవల్లి శ్యామ్, మల్లవల్లి రంగారావులకు కేజీ రూ.15కు విక్రయిస్తున్నట్టు అధికారులకు వెల్లడించారు. లక్షా 74 వేల రూపాయల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. కొయ్యలగూడెం మండలం కన్నాపురానికి చెందిన గ్రంధి శ్రీనివాసరావు గొడౌన్‌పై విజిలెన్సు ఎస్ఐ సీహెచ్ రంజిత్‌కుమార్, విజిలెన్సు తహసీల్దార్ కన్యాకుమారి వారి సిబ్బంది కలిసి దాడి చేశారు. 30 క్వింటాళ్ళ రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అతడు కన్నాపురం పరిసర ప్రాంతాల్లో కేజీ రూ.12కు కొనుగోలు చేసి కొయ్యలగూడెం పరిసర ప్రాంతాల్లో ఉన్న పౌల్ట్రీ ఫారాలకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు అధికారులకు వెల్లడించారు. లక్షా 20 వేల రూపాయల విలువైన బియ్యాన్ని సీజ్‌చేసి అతడిపై కేసు నమోదు చేశారు.


కన్నాపురంలో విజిలెన్సు అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం


జంగంగూడెంలో సీజ్ చేసిన రేషన్ బియ్యం

ద్వారకాతిరుమల ఈవోగా మురళి

▸ డీసీ నుంచి తహసీల్దార్‌గా రివర్షన్ పొందిన అధికారికి పోస్టు!

▸ వైసీపీ సర్కారు ఘనకార్యం ▸ 'ధర్మాన కోర్టు'లో అప్పీలు ఫలితమేనా ?

(అమరావతి-ఆంధ్రజ్యోతి) : ఆయన ఓ డిప్యూటీ కలెక్టర్. పూర్వాశ్రమంలో ప్రకాశం జిల్లాలో పనిచేసినప్పుడు సదావర్తి సత్రం భూముల పరాధీనం కేసులో తప్పుచేశారని గత నెలలోనే ఆయనకు డిప్యూటీ కలెక్టర్ నుంచి తహసీల్దార్‌గా రివర్షన్ ఇచ్చారు. అయినా, వైసీపీ ప్రభుత్వం ఆయనను డిప్యూటీ కలెక్టర్‌గానే భావిస్తూ తాజాగా ద్వారకాతిరుమల ఆలయ ఈవోగా నియమించింది. ఆయన మరెవరో కాదు ఎంఎస్ మురళి. మొన్నటివరకు మదనపల్లి ఆర్డీవోగా పనిచేశారు. సదావర్తి భూముల కేసుల్లో ఆయనకు రివర్షన్ ఇస్తూ రెవెన్యూశాఖ జనవరి 24న ఉత్తర్వులు (జీఓ46) జారీ చేసింది. 31న భారీగా జరిగిన డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో ఆయనను ఆర్డీవో పోస్టు నుంచి తప్పిస్తూ జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశించారు. తన రివర్షన్ కేసును ఆయన రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు కోర్టులో అప్పీల్ చేశారు. మంత్రి ఈ కేసును రివిజన్ చేశారు. ఇంకా ఆయన ఏ నిర్ణయం తీసుకున్నారో బయటకు రాలేదు. ఏ ఉత్తర్వూ వెలుగుచూడలేదు. కానీ రివిజన్ ముగిసిన మరుసటి రోజే మురళిని డిప్యూటీ కలెక్టర్ హోదాలో ద్వారకాతిరుమల ఈవోగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇదెలా సాధ్యమని రెవెన్యూ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. సోమవారం మంత్రి ధర్మాన ప్రసాదరావు వద్ద జరిగిన రెవెన్యూ కోర్టులో మురళిపై ఉన్న రివర్షన్ ఉత్తర్వుల అమలును నిలుపుదల(స్టే) చేస్తూ మంత్రి ఆదేశాలు జారీ చేసి అయినా ఉండాలి. లేదా అసలు కేసులతో సంబంధం లేకుండా పోస్టింగ్ అయినా ఇచ్చి ఉండాలని అధికారవర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఏలూరు డీఈవోగా అబ్రహం


ఎస్. అబ్రహం

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 6: ఎన్నికల సంఘం నిర్దేశాల ప్రకారం జరిగిన బదిలీల్లో తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహంను ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీఈవోగా అబ్రహం సుమారు ఆరేళ్లపాటు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా డీఎస్ఈవో (డిస్ట్రిక్ట్ స్కూల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్) ఆర్.వెంకటరమణ నియమితులయ్యారు. కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా కె.భాస్కర్ బదిలీపై వచ్చారు.

ఓ మహిళ ఘరానా మోసం

ఇంట్లో ఉండగానే ఇల్లమ్మేసింది

▸ బతికుండగానే మరణ ధ్రువపత్రం సృష్టించిన మహిళ

▸ ఫైనాన్స్ కంపెనీలో రుణం పొంది ఎగవేత

▸ జప్తు చేసేందుకు వచ్చిన ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు

▸ కంగుతిన్న ఇంటి యజమాని.. పోలీసులకు ఫిర్యాదు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 6 : తల్లీకుమారుడు బతికి ఉండగానే వారిద్దరూ చనిపోయారంటూ ఓ మహిళ పంచాయతీ కార్యాలయం నుంచి డెత్ సర్టిఫికెట్ సృష్టించింది. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పొందింది. ఆ తల్లి నివాసం ఉంటున్న ఇంటికి తానే వారసురాలు అంటూ ఆ మహిళ రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆ ఇంటిని మరొకరికి విక్రయించేసింది. ఆ ఇల్లు కొనుగోలు చేసిన వ్యక్తి ఓ ప్రైవేటు హోమ్ ఫైనాన్స్ కంపెనీలో పెట్టి రుణం పొందారు. లోను చెల్లించకపోవడంతో ఆ ఇంటిని జప్తు చేసేందుకు కంపెనీ ప్రతినిధులు రావడంతో ఇంట్లో ఉన్న ఆ తల్లీకుమారుడు కంగుతిన్నారు. జరిగిన విషయం తెలుసుకుని ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలివి.. ఏలూరు సత్రంపాడులోని సౌభాగ్యలక్ష్మీ గుడి సమీపంలో కొమ్ముగుర్తి జాన్‌వెస్లీ, అతడి తల్లి 200 గజాల్లో నిర్మించుకున్న ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఆ ఇంటికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు అన్నీ జాన్‌వెస్లీ వద్దే ఉన్నాయి. జాన్‌వెస్లీ దుబాయ్ వెళ్లి కొంతకాలం తరువాత తిరిగి వచ్చి ఆ ఇంట్లోనే నివాసం ఉంటున్నాడు. రాజమండ్రికి చెందిన నీడో హోమ్ ఫైనాన్స్ ప్రతినిధులు ఆ ఇంటికి వచ్చి ఇల్లును జప్తు చేస్తామని చెప్పడంతో జాన్‌వెస్లీ అతడి తల్లి ఖంగుతిన్నారు. ఎందుకని ఆరా తీయగా రాజమహేంద్రవరానికి చెందిన నిదుపాటి చలమయ్య అనే వ్యక్తి ఆ ఇంటి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను అతని పేరు మీద ఉన్నవాటికి రూ.26 లక్షల రుణం తీసుకుని తిరిగి చెల్లించలేదని అందువల్లే ఆ ఇంటిని సీజ్ చేస్తున్నట్టు వెల్లడించారు. పూర్తిస్థాయిలో జాన్‌వెస్లీ వివరాలు తెలుసుకోగా 2012లో అతడి తల్లి మరణించినట్టు ఏలూరు రూరల్ మండలం మల్కాపురం పంచాయతీ కార్యాలయం నుంచి డెత్ సర్టిఫికెట్‌ను రాజమహేంద్రవరానికి చెందిన డొక్కల రమణ అనే మహిళ తీసుకుంది. 2016లో జాన్‌వెస్లీ మరణించినట్టు అదే పంచాయతీ కార్యాలయం నుంచి సర్టిఫికెట్ తీసుకుని పెదపాడు మండల తహసీల్దార్ కార్యాలయం నుంచి ఫ్యామిలీ సర్టిఫికెట్‌ను పొందింది. సత్రంపాడులో ఉన్న 200 గజాల ఇంటికి తాను వారసురాలునంటూ నూజివీడులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆతరువాత ఆ ఇంటిని రాజమహేంద్రవరానికి చెందిన చలమయ్యకు విక్రయించింది. చలమయ్య తన పేరుమీద ఉన్న డాక్యుమెంట్స్‌తో రాజమ హేంద్రవరంలో ఉన్న నీడో హోమ్‌ఫైనాన్స్‌లో రూ.26 లక్షల రుణం తీసుకు న్నట్టు గుర్తించారు. జాన్‌వెస్లీ ఫిర్యాదు మేరకు డొక్కల రమణపై ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు గడ్డివాముల దగ్ధం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 6: ఎం.నాగులపల్లిలోని పలువురు రైతుల పొలాల్లో ఆరు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. మంగళవారం ఉదయం పొలాలకు వెళ్లిన ఐదుగురు రైతుల గడ్డి వాములు దగ్ధమై ఉండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేసి ఉంటారని సుమారు రూ.1.20 లక్షల నష్టం సంబవించిందని ప్రాథమిక అంచనా. ఈ క్రమంలో ద్వారకాతిరుమల ఎంపీపీ బొండాడ మోహినీ వెంకన్నబాబు, ఎస్ఐ జి.సతీష్ ఘటనా స్థలానికి చేరుకుని రైతుల నుంచి వివరాలు సేకరించారు. సత్వరమే దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని స్థానిక నేత వెంకన్నబాబు ఎస్ఐను కోరారు.

దుబాయ్‌లో మొగల్తూరు వాసి మృతి


నర్సింహారావు (ఫైల్)

మొగల్తూరు,ఫిబ్రవరి 6 :మొగల్తూరు పంచాయతీ కడలివారిపాలెంకు చెందిన గుబ్బల నర్సింహారావు(46) దుబాయ్‌లో ఆయన జన్మదినం రోజునే మృతి చెందారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఆయన దుబాయ్‌లో ఓ కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. 1978 ఫిబ్రవరి 4న జన్మించిన ఆయన గుండెపోటుతో 2024 ఫిబ్రవరి 4న మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని దుబాయ్‌లో ఆయన పని చేసే కంపెనీ యాజమాన్యం హైదరాబాద్ వరకు పంపగా మంగళవారం అక్కడనుంచి గ్రామస్థులు, కుటుంబ సభ్యులు మొగల్తూరుకు తీసుకువచ్చారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతితో కడలివారిపాలెంలో విషాధఛాయలు అలుముకున్నాయి.

ప్రభుత్వాసుపత్రిలో ఆధునిక వైద్యం : కలెక్టర్


కంటి పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 6 : కంటి సమస్యలకు ప్రభుత్వాసుపత్రిలో ఆధునిక వైద్యం అందిస్తున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని కంటి వైద్య విభాగంలో రూ.27 లక్షల విలువైన ఆధునిక కంటి వైద్య పరీక్షల సామగ్రిని మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఆధునిక పరీక్షల పరికరాలను ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేశామని, కంటి పరీక్షతో పాటు కళ్లద్దాలు, ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యు.ఆగ్నేస్ విజయ ఆధునిక కంటి వైద్య పరికరాల గురించి వివరించారు. అనంతరం కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటి విభాగం ప్రధాన వైద్యులు మల్లికార్జున్, డీసీహెచ్ పాల్ సతీష్‌కుమార్, ఆర్ఎంవో ప్రసాద్‌రెడ్డి, సివిల్ సర్జన్ ఏఎస్ రామ్, కంటి వైద్య నిపుణులు సుచిత్ర, జాయిస్, శ్రీనిజ, దివ్య, దయ, నర్సులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రంగాపురం పాఠశాలలో ల్యాబ్‌లు, డిజిటల్ లైబ్రరీ


పాఠశాలను సందర్శించిన డీఈవో

లింగపాలెం, ఫిబ్రవరి 6: రంగాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ల్యాబ్‌లు, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయనున్నట్లు డీఈవో శ్యామ్‌సుందర్ తెలిపారు. పాఠశాల పీఎమ్‌శ్రీ పథకంలో ఎంపికైందని, 75 శాతం కేంద్ర నిధులు, 25శాతం రాష్ట్రప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం ఆయన పాఠశాలను పరిశీలించారు. ల్యాబ్‌లు, డిజిటల్ లైబ్రరీలు, పాఠశాల ఆవరణ గ్రౌండ్ పూర్తి అభివృద్ధి చేసే దిశగా నిధులు ఉపయోగిస్తామన్నారు. పాఠశాల నుంచి ఇటీవల ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులను డీఈవో అభినందించారు. హెచ్ఎం బి.వెంకటరత్నం, ఏఎంవో రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మాజీగూడెంలో మధ్యాహ్న భోజనం పరిశీలన


భోజనాన్ని పరిశీలించిన ఎంఈవో -2

లింగపాలెం, ఫిబ్రవరి 6: ధర్మాజీగూడెం బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో-2 రవీంద్ర మంగళవారం పరిశీలించారు. భోజనం ఎలా ఉంది అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. మధ్యాహ్నం భోజన పథకం అమలుపై పలు సూచనలు ఇచ్చారు. ఆయనతో పాటు హెచ్ఎం త్రిపురసుందరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలసానిపల్లి పాఠశాలల తనిఖీ

భీమడోలు, ఫిబ్రవరి 6: పోలసానపల్లిలో పలు ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో భాస్కర్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. నెంబర్ 1, 2 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, నాడు-నేడు నిర్మాణాలను పరిశీలించారు. ఈ నెల 8న విద్యార్థులందరికి నులి పురుగునివారణ మాత్రలు పంపిణీ చేయబడతాయని ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పోలవరం పాఠశాలలో నీళ్ల ట్యాంక్ పరిశుభ్రం


వాటర్ ట్యాంకు పరిశీలిస్తున్న హెచ్ఎంలు

పోలవరం, ఫిబ్రవరి 6: పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వాటర్ ట్యాంకును మంగళవారం హెచ్ఎంలు పరిశీలించారు. పాఠశాల నీళ్ల ట్యాంకులో జంతు కళేబరం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేయడంతో అధికారులు స్పందించారు. కొయ్యలగూడెం డీవైఈవో ఎం రామన్నదొర ఆదేశాలతో గూటాల జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కేవీ.రాఘవన్ పరిశీలించారు. గతంలో సత్యసాయి మంచినీటి కోసం వినియోగించేవారని, పాఠశాలలో ఆర్వో ప్లాంటు ఏర్పాటుతో ట్యాంక్ నిరుపయోగంగా ఉందన్నారు. అందులో పిల్లి పడి చనిపోవడంతో దుర్వాసన వచ్చిందని, ఆ నీటిని విద్యార్థులు వాడ లేదని పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం లక్ష్మీకాంతం తెలిపారు. నీళ్ల ట్యాంకు శుభ్రం చేయించామని, ప్రస్తుతం ఇబ్బంది లేదని తెలిపారు.

మత్తు పదార్థాల వినియోగం ప్రాణాంతకం


పాఠశాలలో మాట్లాడుతున్న శేఖర్‌బాబు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 6: మత్తు పదార్థాల వినియోగం ప్రాణాంతకమని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రామ్ మేనేజరు జి.శేఖర్‌బాబు అన్నారు. చాటపర్రు మాగంటి ఆంజనేయ సత్యవతి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తుతో జీవితం శూన్యమని, మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులకు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.విజయ్‌కుమారి, ఉపాధ్యాయులు జోసెఫ్, పి.మహేష్, సత్యవాణి, పాఠశాల ద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి


కోర్టు పోలీస్ సిబ్బందితో రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 6: జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారానికి పోలీస్‌శాఖ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. లోక్ అదాలత్ భవనంలో పోలీస్ శాఖలోని కోర్టు సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. రత్న ప్రసాద్ మాట్లాడుతూ మార్చి 9న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. క్రిమినల్ కేసుల పరిష్కార నిమిత్తం అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. కక్షిదారులకు కౌన్సిలింగ్ నిర్వహించి రాజీయోగ్యమైన అన్ని కేసులలో పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. లోక్‌అదాలత్ ప్రీసిట్టింగ్‌లను వినియోగించుకుని కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు.

రహదారి భద్రత చిహ్నాలను ఉల్లంఘించరాదు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 6: వాహనాలను నడిపేటప్పుడు రహదారి భద్రత చిహ్నాలను ఉల్లంఘిస్తే భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఎంవీఐ జి.ప్రసాదరావు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా ఉపరవాణా కమీషనర్ శాంతకుమారి ఆధ్వర్యంలో మంగళవారం వట్లూరు శ్రీ చైతన్య జూనియర్ కాలేజీలో బస్సు డ్రైవర్లు, క్లీనర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్చరిక చిహ్నాలు సాధారణంగా ఎరుపు అంచుతో త్రికోణం, నీలం రంగులో ఉంటాయన్నారు. చిహ్నాలను బేఖాతరు చేయడం వల్ల శిక్ష, భారీ జరిమానా చెల్లించాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కేవీఎస్.ప్రసాద్, జి స్వామి, కళాశాల వాహన ఇన్‌చార్జి మధు, డ్రైవర్లు, క్లీనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 6: బాల బాలికలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని క్రాప్ కోఆర్డినేటర్ పి.సుమాంజలి అన్నారు. చాటపర్రు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్, క్రాప్ సంస్థ ఆధ్వర్యంలో బాలమేళా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు జామెంట్రీ బాక్సులు, పరీక్షా ప్యాడ్‌లు, పుస్తకాలు, ఫైల్స్ పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం పి.విజయకుమారి మాట్లాడుతూ బాలలకు ఫన్నీ గేమ్స్ ద్వారా ఒత్తిడి అధిగమించి ప్రతిభ బయటకు వస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల పీఈటీ ఎంఎల్ శ్రీనివాసరావు, కె.జోసఫ్, క్రాప్ సిబ్బంది వసుంధర తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరు ప్రజలకు తాగినీటి ఇబ్బందులు

నిడమర్రు, ఫిబ్రవరి 6: కొల్లేరు ప్రజలు తాగునీటి అవసరాల కోసం తీవ్రంగా ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం నుంచి కనీస స్పందన కరువైందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా భైనేపల్లి, ఆముదాలపల్లి గ్రామాలలో మంగళవారం పర్యటించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. రానున్న ఎన్నికలలో జనసేన, టీడీపీ అభ్యర్థులకు గెలిపించకోవడం ద్వారా సమస్యలను పరిష్కరించకోవచ్చని భరోసా ఇచ్చారు. నిమ్మల దొరబాబు, పంది రాంబాబు, అయితం ప్రసాద్, అంజి, బాలాజి, సింహాచలం, తానేటి జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

ఒప్పందం మరిచారు

సమ్మె సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలి
కలెక్టరేట్ వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 6: మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వ ఒప్పందం మరిచిందని, హామీల అమలుకు జీవోలు విడుదల చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. 16 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలకు వెంటనే జీవోలు విడుదల చేయాలని, ఇంజినీరింగ్ విభాగం వర్కర్స్‌కు స్కిల్డ్, సెమీస్కిల్డ్ జీతాలు ఇవ్వాలని, క్లాప్ ఆటోడ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఏపీ మున్సిపల్ వర్కర్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్రకమిటీ పిలుపులో భాగంగా ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సోమయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు గత ఏడాది డిసెంబర్ 26 నుంచి 2024 జనవరి 10వరకు 16రోజులు రాష్ట్రవ్యాప్త సమ్మె నిర్వహించారని తెలిపారు. సమ్మె విరమణ సందర్భంగా ప్రభుత్వం కార్మిక సంఘాలతో ఒప్పందం జరిగిందని, దానికి అనుగుణంగా ప్రభుత్వం మినిట్స్ కాపీ ఇచ్చిందని తెలిపారు. వీటికి అనుగుణంగా జీవో విడుదల చేయలేదన్నారు. సమ్మె విరమించి 25రోజులు దాటినా జీవోలు విడుదల చేయకపోవడం అన్యాయం అన్నారు. తక్షణం ఒప్పందానికి అనుగుణంగా జీవోలు విడుదల చేయాలని లేనిపక్షంలో మరోసారి తాము సమ్మెకు సన్నద్ధమవుతామని హెచ్చరించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.బాలరాజు, ఎ.జాన్‌బాబు, కృష్ణారావు, వెంకటేష్, నూకరత్నం, నాగమణి, దావీదు, గాబ్రియేలు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

అటవీభూముల సమస్యలు పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు

జిల్లాలోని నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధి, ఎన్టీఆర్ జిల్లాలో వేలాది ఎకరాల ప్రభుత్వ బంజరు భూమిని 1967 అటవీచట్టం సెక్షన్ (4) నోటిఫికేషన్ ఉందని, సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. డి.హరినాథ్, పీఎస్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ అటవీశాఖ నోటిఫికేషన్ ఇవ్వకముందే ఈ భూములు ప్రభుత్వ బంజరు భూములుగా రికార్డులో నమోదయ్యాయన్నారు. ప్రస్తుతం సాగుచేస్తున్న వారి సాగురికార్డు నమోదు చేయాలని కోరారు. క్లెయిమ్ పరిష్కరించలేని వాటిని ఇకమీదట సెటిల్‌మెంట్ అధికారితో పరిష్కారం చేయాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐర్ల జిల్లా కార్యదర్శి డి.పుల్లారావు, కళావతి, వేముల బక్కయ్య, చాట్ల బాబురావు, పామర్తి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే నిర్బంధిస్తారా.. సర్పంచ్‌ల నిరసన


రావికంపాడులో రోడ్డుపై బైఠాయించిన సర్పంచ్‌లు


తుళ్లూరు స్టేషన్‌లో ఉంగుటూరు సర్పంచ్‌లు

కామవరపుకోట, ఫిబ్రవరి 6: ప్రశ్నించిన వారిని నిర్బంధించడం ప్రభుత్వానికి పరిపాటి అయిందని సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర సర్పంచ్‌ల చాంబర్ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి కామవరపుకోట మండలం నుంచి వెళుతున్న సర్పంచ్‌లను పోలీసులు అడ్డుకున్నారు. ఆడమిల్లి, రావికంపాడు సర్పంచ్‌లు గూడపాటి కేశవరావు, వేముల నాగేశ్వరరావును తడికలపూడి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రావికంపాడులో పలువురు సర్పంచ్‌లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమాల్లో టీడీపీ శ్రేణులు, పలువురు సర్పంచ్‌లు, స్థానికులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల అరెస్టు దారుణం : గన్ని

భీమడోలు, ఫిబ్రవరి 6: అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన సర్పంచ్‌లను అరెస్టు చేయడం దారుణమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. ఉంగుటూరు నియోజకవర్గం నుంచి పలువురు మహిళా సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి బయలుదేరగా వారిని అడ్డుకుని తుళ్ళూరు పోలీస్ స్టేషన్‌కు తరలించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని గన్ని అన్నారు. సర్పంచ్‌ల వ్యవస్థను నిర్వీర్యం చేసిన జగన్ పరిపాలనకు అనర్హుడన్నారు.

● పెదవేగి: పంచాయతీ నిధులను ఇవ్వాలని కోరిన సర్పంచ్‌లను నిర్బంధించిన ప్రభుత్వ తీరుపై మాజీఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ధ్వజమెత్తారు. సర్పంచ్‌లను నిర్బంధించడంపై ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు పదవి చేపట్టిన దగ్గర నుంచి గ్రామాల్లో పారిశుధ్యం, డ్రెయిన్ల పరిశుభ్రత, తాగునీటి సరఫరా, వీధిలైట్లు నిర్వహణ వంటి వాటి ఖర్చులతో సర్పంచ్‌ల చేతిచమురు వదులుతోందని, ఈ మూడేళ్లలో ఒక్కో సర్పంచ్ లక్షల్లో ఖర్చుచేశారని, ఆ నిధులను ఇవ్వకుండా జగన్ ప్రభుత్వం సర్పంచ్‌ల జీవితాలతో ఆడుకుంటోందని ఆయన విమర్శించారు. పంచాయతీ నిధులను జగన్ ప్రభుత్వం అడ్డదారుల్లో బొక్కేస్తూ, నిధులివ్వమని అడిగినవారిని నిర్బంధిస్తూ రాక్షసానందం పొందుతోందన్నారు. పంచాయతీలకు న్యాయబద్ధంగా రావాల్సిన నిధులు ఇవ్వమని వేడుకోవడానికి ఛలో అసెంబ్లీ చేపట్టిన సర్పంచ్‌లను గుమ్మం దాటకుండా గృహనిర్బంధాలు చేయడం దారుణమన్నారు. జగన్‌కు నీతి, నిబద్ధత ఉంటే ఇప్పటికైనా పంచాయతీ నిధులను తక్షణం జమ చేయాలన్నారు. గ్రామ ప్రథమ పౌరులు ప్రభుత్వానికి అసాంఘిక శక్తులుగా కనిపిస్తున్నారా అంటూ ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిన తప్పును కప్పి పుచ్చుకోవడానికి జగన్ సర్పంచ్‌లను అసాంఘిక శక్తులుగా చూపించి, నిధుల విషయాన్ని బయటకు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. సర్పంచ్‌ల న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించి, గ్రామాలు సుభిక్షంగా ఉండేలా చూడాలని జగన్‌కు సూచించారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం


శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కుక్కునూరు, ఫిబ్రవరి 6: కుక్కునూరు పాత రామాలయం ప్రాంగణంలో మంగళవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణం వైభవంగా నిర్వహించారు. జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థాన పర్యవేక్షణలో కల్యాణం నిర్వహించారు. పారిజాతగిరి ఆలయ కల్యాణ మూర్తులతో దేవస్థాన ప్రధానార్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో జరిగిన కల్యాణాన్ని అధిక సంఖ్యలో భక్తులు వీక్షించారు. భక్తులకు ప్రత్యేకంగా లడ్డూ ప్రసాదం, కల్యాణ అక్షింతలు భక్తులకు అందజేశారు. రామాలయం కమిటి ఆధ్వర్యంలో వెయ్యి మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. దేవస్థానం ఈవో రాంబాబు, స్థానిక రామాలయం సభ్యులు పర్యవేక్షించారు.

వేంకటేశ్వరాలయంలో అధ్యయనోత్సవాలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 6: ఆర్ఆర్.పేట వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అధ్యయనోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. మధురై నుంచి వచ్చిన బాలాజీ స్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, కోసూరి సత్యనారాయణాచార్యులు భక్తులతో పూజలు చేయించారు. ఆలయ చైర్మన్ తేలేటి శ్రీనివాస్, ఈవో నాగం సన్యాసిరావులు భక్తులకు ఏర్పాట్లు చేశారు. బుధవారంతో అధ్యయనోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 6: దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో పలు ఆలయాలకు ధర్మకర్తల మండలి నియమించనున్నట్లు ఈవో కలగర శ్రీనివాస్ తెలిపారు. ఉంగుటూరు భీమేశ్వరస్వామి, చల్లాలమ్మ దేవస్థానాలు, ఏలూరు నగరంలోని కామాక్షి ధర్మసత్రం, పెదవేగిలోని పార్వతీ పరమేశ్వరస్వామి ఆలయాలకు నూతన ధర్మకర్తలను నియమించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ధర్మకర్తలు 15 రోజుల్లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

నులిపురుగుల నివారణ విజయవంతం చేయాలి

లింగపాలెం, ఫిబ్రవరి 6: జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం విజయవంతం చేయాలని కె.గోకవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కృష్ణకిషోర్ కోరారు. పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలతో మంగళవారం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. 19 ఏళ్ల ప్రతిఒక్కరికి నులి పురుగుల నివారణ మాత్రలు వేయడానికి వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. డాక్టర్ ఆబీదా, అక్బార్ హుస్సేన్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశాలు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో ఆశాల పాత్ర కీలకం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 6: జాతీయ కార్యక్రమాల అమలులోను, ఆరోగ్య పరిరక్షణలో ఆరోగ్య, ఆశాకార్యకర్తల పాత్ర కీలకమైనదని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. సీహెచ్ పోతేపల్లి, ద్వారకాతిరుమలలోని పీహెచ్‌సీలలో మంగళవారం జరిగిన ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలకు ఆశాలు ఇప్పటికే పలు రకాల సేవలు అందిస్తున్నారన్నారు. ద్వారకాతిరుమల, పోతేపల్లి వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, శ్రీజ. ఆరోగ్య కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


విశ్రాంత శాస్త్రవేత్తతో కైకరం హైస్కూలు విద్యార్థులు

రాకెట్ ప్రయోగాలు వివరించిన విశ్రాంత శాస్త్రవేత్త

ఉంగుటూరు, ఫిబ్రవరి 6: అంతరిక్షంలోకి రాకెట్ ప్రయోగాలపై కైకరం ఉన్నత పాఠశాల విద్యార్థులకు విశ్రాంత శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ అవగాహన కల్పించారు. మంగళవారం పాఠశాలను సందర్శించిన ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అంతరిక్ష పరిశోధనలు జరుగుతున్నాయని అన్నారు. విద్యార్థులను భవిష్యత్ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల వంతని ఆయన అన్నారు. పలువురు విద్యార్థులు రాకెట్ ప్రయోగాలపై పలు సందేహాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌కు ఒప్పందం


ఎంవోయూ పత్రాలు అందుకున్న ప్రిన్సిపాల్

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 6: కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కంప్యూటర్ స్కిల్స్, ఆటోకాడ్, టాలీ, పైథాన్ తదితర కోర్సుల్లో శిక్షణపై నగరానికిచెందిన ఓటీపీ టెక్నాలజీస్‌తో మంగళ వారం అవగాహన ఒప్పందాన్ని (ఎంవోయు) కుదుర్చుకున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ జి.గిరిబాబు మంగళవారం తెలిపారు. డిగ్రీ కోర్సుల అభ్యర్థులకు ఈ ఏడాది మే 27 వరకు మూడు నెలల పాటు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణకాలంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉద్యోగావకాశాలను సంస్థ కల్పిస్తుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ అజయ్ కుమార్, ఓటీపీ టెక్నాలజీస్ సీఈవో హరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజకీయ పక్షాలు ఎన్నికల నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న ఆర్డీవో ఖాజావలి

ఉంగుటూరు, ఫిబ్రవరి 6: రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పక్షాలు ఎన్నికల నిబంధనలు పాటించి అధికారులకు సహకరించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఖాజావలి కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పక్షాలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల తహసీల్దార్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెదవేగి తహసీల్దారుగా సూర్యప్రభ

పెదవేగి, ఫిబ్రవరి 6: తహసీల్దారుగా ఎం.సూర్యప్రభ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కాకినాడ కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు.


సమావేశంలో మాట్లాడుతున్న వసంతరావు

చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలి

చింతలపూడి, ఫిబ్రవరి 6: చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తిచేసి అంధ్ర కాలువకు నీరు అందించాలని సీపీఐ సీనియర్ నాయకులు ఎం.వసంతరావు కోరారు. చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన నిర్వాసితులు, పెద్ద చెరువు ఆయకట్టు రైతుల సమావేశం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సమ్మెటవారిగూడెంలో మంగళవారం జరిగింది. వసంతరావు మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-1, ఫేజ్-2 పూర్తి చేసి మెట్టప్రాంతానికి సాగు, తాగునీరు అందించాలన్నారు. మెయిన్ కెనాల్ నుంచి అంధ్ర కాలువకు సాగునీటిని సరఫరా చేయడం వలన అంధ్ర కాలువకు అనుబంధంగా ఉన్న 27 చెరువులకు నీరు చేరుతుందని, దానివలన ఏడు వేల ఎకరాలకు నీరు అందుతుందని తెలిపారు. గణిజర్ల, ఎండపల్లి, మల్లాయిగూడెం, పోతునూరు గ్రామాల్లో కూడా సాగు, తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని ఈ పథకం సత్వరం పూర్తి చేయాలన్నారు. నీటిపారుదల శాఖ డీఈ అర్జునరావు మాట్లాడుతూ అంధ్ర కాలువ పూడిక తీయడానికి ఎంపీ నిధులతో ప్రతిపాదనలు చేశామని, ఎత్తిపోతల పథకం మెయిన్ కెనాల పూర్తయిన తరువాత అంధ్ర కాలువ ప్రారంభమయ్యే చోట తుమ్మూరు వద్ద మెయిన్ కెనాల్ ద్వారా సబ్ కెనాల్ ఏర్పాటుచేయడానికి 40 కోట్లతో ప్రతిపాదనలు చేశామన్నారు. ఇది మెయిన్ కెనాల్ పూర్తయిన తరువాతే జరుగుతుందన్నారు. నాబార్డు నిధుల ద్వారా అంధ్ర కాలువ అనుబంధంగా ఉన్న ఏడు చెరువులకు గట్లు పటిష్టం చేయడం, తూముల మరమ్మతులు చేస్తామని చెప్పారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుల్లూరు సోమశేఖర్, డి.కృష్ణ, టి.బాబు, రావెళ్ళ రాజా, చీకటి బాబూరావు, గన్నమనేని వాసు, ఎస్.కె.కాలేషా రైతు నాయకులు పాల్గొన్నారు.


వేగవరంలో జబర్దస్త్ కళాకారుల ప్రదర్శన

బీజేపీ తరపున జబర్దస్త్ కళాకారుల ప్రచారం

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 6: మండలంలో బీజేపీ తరపున జబర్దస్త్ కళాకారులు మంగళవారం ప్రచారం చేశారు. వేగవరం, దేవులపల్లి, లక్క వరం గ్రామాల్లో జబర్దస్త్ కళాకారులు, సినీ గాయకులు సందడి చేశారు. సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ తపన ఫౌండేషన్ ద్వారా గారపాటి చౌదరి చేస్తున్న సేవలను వివరించారు. జబర్దస్త్ టీమ్, సినీ గాయకులతో కూడిన బృందం విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించింది. అదిరే అభి, అప్పారావు, బాబీ, వినోదిని, ఇమ్మాన్యుయేల్, హాస్య భరిత ప్రదర్శనలు చేయగా. సినీ గాయకులు లాస్య ప్రియ, అరుణ్ కౌండిన్య సినీ పాటలతో స్థానికులను ఉర్రూతలూగించారు. రూరల్ మండలం పారేపల్లి సత్యనారా యణ, మండల ఉపాధ్యక్షులు సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 191మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 6: మంగళవారం జరిగిన ఇంటర్మీడియట్ ఒకేషనల్ ప్రాక్టికల్స్ పరీక్షకు జిల్లాలో మొత్తం 1585 మంది విద్యార్థులు దరఖాస్తుచేసుకోగా 1394మంది హాజరయ్యారని డీవీఈవో బి.ప్రభాకరరావు తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందన్నారు.

జాహ్నవికి నర్తనకేళి నంది పురస్కారం

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 6: దేవదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో ద్రాక్షారామ భీమేశ్వర దేవస్థానంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో ఏలూరు ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థిని భూపాల జాహ్నవికి 'నర్తనకేళి నంది' పురస్కారం లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వ రరావు మంగళవారం తెలిపారు. విజేతకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని బహుకరించారని వివరించారు. జాహ్నవిని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ సుగుణారెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ నాయుడు అభినందించారు.

భీమడోలు యువతి ఏలూరులో అదృశ్యం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 6: భీమడోలు మండలం అర్జావారిగూడెంనకు చెందిన యువతి ఏలూరులో అదృశ్యమైంది. ఏలూరులో కంప్యూటర్ కోర్సు నేర్చుకుంటుంది. ఈనెల 5న ఇంటి నుంచి కోచింగ్ సెంటర్‌కు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. ఆమె కోసం వెతికినప్పటికీ ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యులు మంగళవారం ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యం క్రింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టి.నరసాపురం మండలంలో బాలిక అదృశ్యం

టి.నరసాపురం, ఫిబ్రవరి 6: మండలంలో ఓ గ్రామానికి చెందిన పదో తరగతి బాలిక అదృశ్యమైంది. ఈనెల 5న ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లినట్టు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అనుమానం ఉన్న వ్యక్తిపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ దుర్గామహేశ్వరరావు తెలిపారు.


జంగారెడ్డిగూడెంలో నాయకులతో సమావేశమైన బొమ్మాజీ అనిల్


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి

చంద్రబాబు సభకు ప్రజాదరణ

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 6: చింతలపూడిలో టీడీపీ అధినేత నిర్వహించిన రా.. కదలిరా సభకు మంచి ప్రజాదరణ వచ్చిందని, సభను జయప్రదం చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు టీడీపీ నియోజకవర్గ నాయకుడు బొమ్మాజి అనిల్ కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో మంగళవారం టీడీపీ నాయకులతో సమావేశమయ్యారు. చంద్రబాబు సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయడం సంతోషంగా ఉందన్నారు. అందరూ ఐక్యంగా రానున్న ఎన్నికల్లో టీడీపీకి విజయం అందించాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. సమావేశంలో రావూరి కృష్ణ, రాజాన సత్యనారాయణ, పెనుమర్తి రామ్‌కుమార్, కుక్కల మాధవ్, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, కొంచాడ ప్రసాద్, పరిమి సత్తిపండు, తూటికుంట రాము, దుర్గారావు, షేక్ ముస్తఫా, కొండ్రెడ్డి కిషోర్, నంబూరి రామచంద్రరావు, చెరుకూరి శ్రీధర్, పట్టణ, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతలపూడిలో జరిగిన రా కదలిరా బహిరంగ సభకు తరలివచ్చి విజయవంతం చేసిన కార్యకర్తలు, అభిమానులుకు టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుమర్తి రామారావు కృతజ్ఞతలు తెలిపారు. ఇంత గొప్ప విజయంలో తనను భాగస్వామిని చేసిన పార్టీ నాయకులకు జోన్-2 ఇన్‌చార్జ్ మందలపు రవి, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, మాజీ కన్వీనర్ ముత్తారెడ్డి, జిల్లా అధ్యక్షుడు గన్ని ఆంజనేయులు, పార్టీ పరిశీలకులు కోళ్ల నాగేశ్వరరావుకు పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు.

● కామవరపుకోట: చింతలపూడి చంద్రబాబు సభ ఊహించిన దానికంటే విజయవంతమైందని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ అన్నారు. టీడీపీ, జనసేన కూటమికి అశేష ప్రజాదరణ ఉందని చింతలపూడిలో జరిగిన రా.. కదలిరా సదస్సులో తేటతెల్లమైందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ కూటమి విజయం సాధిస్తుందన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు వజీర్‌ఖాన్, గోరింక దాసు, పసుమర్తి పార్థసారధిబాబు, వేముల నాగేశ్వరరావు, సాయన సత్యనారాయణ, యర్రావుల దుర్గారావు, పాకలపాటి రవి తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కలెక్టరేట్ :** దివ్యాంగ విద్యార్థి ఎం.డేవిడ్‌జాక్‌కు దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యాలయంలో ఏడీ రాకాడమణి ల్యాప్‌టాప్‌ను మంగళవారం అందజేశారు.
- **ఏలూరు రూరల్ :** ఏఎస్ఆర్ స్టేడియంలో శిక్షణ పొందుతున్న స్పోర్ట్స్ హాస్టల్ విద్యార్థులకు మహిళా వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కర్రి అరుణ తెలిపారు. మేరీ మాణిక్యం, ఆర్.సత్యవతి, పద్మావతి, శ్రీలక్ష్మి, అరుణకుమారి పాల్గొన్నారు.
- **టి.నరసాపురం :** అనకాపల్లి జిల్లా పాయకరావు పేటలో ఈ నెల 10న జరిగే దళితవాడ ప్రత్యేక పంచాయతీ సాధన సంకల్ప సభను విజయవంతం చేయాలని అంబేద్కర్ ఇండియా మిషన్ (ఎయిమ్) రాష్ట్ర నాయకులు దూబా విల్సన్, బి.నాగేంద్ర, అర్జా సాగర్, జి.నాగరాజు కోరారు. దళిత యువత అధిక సంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు.
- **జీలుగుమిల్లి :** డ్వాక్రా మహిళలకు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి వైఎస్సార్ ఆసరా చెక్కులు అందజేశారు. సర్పంచ్ చిర్రి జగదాంబ, ఎంపీపీ కొర్స పోశమ్మ, మల్లం వసంత్, బోదా శ్రీనివాసరెడ్డి, డీఆర్ డీపీ ఏపీడీ ఆర్.విజయరాజు, ఏపీఎం రామారావు పాల్గొన్నారు.
- **ఉంగుటూరు :** మానవత ఆధ్వర్యంలో మంగళవారం నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వంద మంది రోగులను పరీక్షించి మందులు అందించారు. 23 మందికి ఆపరేషన్లు, 24 మందికి కళ్లజోళ్లకు సిఫారసు చేశారు. పుప్పాల గోపి, గంజి రవికుమార్, మట్టా మురళి, కె.హరినాథ్, కొరిపల్లి శ్రీను, పంతుల వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుకు జబ్బు

» మార్గమధ్యంలో దింపేయడంతో ప్రయాణికుల పాట్లు



ముసునూరు, ఫిబ్రవరి 6: ఆర్టీసీ బస్సులకు మెయింటినెన్స్ సరిగా లేకపోవడంతో ఎక్కడ బడితే అక్కడ ఏదో ఒక మరమ్మతుకు గురై నిలిచి పోతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ఉదయం నూజివీడు డిపోకు చెందిన బస్సు ఏలూరు నుంచి నూజివీడు వెళుతుండగా ముసునూరు మెయిన్ సెంటర్ వద్ద మరమ్మతుకు గురై నిలిచిపోయింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు ఆటోలో వెళ్ళారు. అయితే బస్సును మరమ్మతు చేసేందుకు ఎవరూ రాకపోవడంతో బస్సు ముసునూరులోనే నిలిచిపోయింది. కాలం చెల్లిన బస్సులు నడుపుతూ, వాటికి కనీసం మెయింటినెన్స్ కూడా చేయకపోవడం వల్లే ఈ పరిస్థితులు నెలకొంటున్నాయని ప్రజలు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చిరంజీవికి కామినేని అభినందన



కైకలూరు, ఫిబ్రవరి 6: పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత, సినీ హీరో చిరంజీవికి మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అభినంద నలు తెలిపారు. సోమవారం హైదరాబాదులో చిరంజీవి నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ సినీ రంగంలో మెగాస్టార్‌గా ఎదగడమేగాక బ్లడ్ బ్యాంకు ద్వారా ఆయన చేసిన సేవలకు గుర్తింపు లభించిందని అన్నారు. ఆయన మరిన్ని అవార్డులను అందుకోవాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి : ఎంఈవో

కలిదిండి, ఫిబ్రవరి 6 : టెన్త్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఎంఈవో ప్రభాకర్ బాబు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మంగళవారం ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులందరికీ కృష్ణా జడ్పీ చైర్మన్ సౌజన్యంతో స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా ఇస్తున్నారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మొండికేసిన ఎండీయూ వాహనానికి మోక్షం

ముదినేపల్లి, ఫిబ్రవరి 6 : ముదినే పల్లి మండలం బొమ్మినం పాడులో గత 20 రోజులుగా మొండి కేసిన ఎండీయూ వాహనానికి మోక్షం కలిగింది. ఇంజన్‌లో లోపంతో కదల కుండా పడి ఉన్న ఆ వాహనం పై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల వచ్చిన వరుస కథనాలపై స్పందించిన రెవెన్యూ అధికారులు వాహనానికి మర మ్మతులు చేయించి కదిలించారు. అధికారుల ఆదేశాల మేరకు వీఆర్‌ఓ సుబ్రహ్మణ్యం, కొత్త ఎండీయూ ఆపరేటర్ వాహనాన్ని బాగు చేయించారు. సోమవారం నుంచి ఆ వాహనంతో ఇంటింటికి బియ్యం పంపిణీ చేస్తున్నారు.



ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ కోసం నిరీక్షిస్తున్న మహిళలు(ఇన్‌సెట్) రిజిస్ట్రేషన్ చేస్తున్న అధికారులు


లబ్ధిదారుల సహనానికి పరీక్ష

» గంటల తరబడి పేదల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ

మండవల్లి, ఫిబ్రవరి 6: జగనన్న కాలనీలో పేదలకు కేటాయించిన ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ కు ప్రభుత్వం కొత్తగా రూపొందించిన యాప్‌లో ఆన్‌లైన్ సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో అటు అధికారులు, ఇటు లబ్ధిదారులకు అవస్థలు తప్పడం లేదు. దీంతో రోజుల తరబడి రిజిస్ట్రేషన్ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. యాప్ ఓపెన్ కాక రోజు మొత్తంలో ఒకటి, రెండు మించి చేయలేకపోయారు. మండవల్లిలో 223 పట్టాలు రిజిస్ట్రేషన్ చేయవలసిన ఉండగా సోమవారం నాటికి కేవలం 54 మాత్రమే అధికారులు అతి కష్టం మీద చేసినట్లుగా అధికార వర్గాల సమాచారం. మంగళవారం రెండు సిస్టంలతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు అధికార యాంత్రాంగం చేసిన ప్రయత్నాలు అంతంత మాత్రంగానే సాగాయి. మంగళవారం నాడు మరో 60 పట్టాలు రిజిస్ట్రేషన్ చేశారు. ఇప్పటివరకు మొత్తం మండవల్లిలో 115 పట్టాలు మాత్రమే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తయినట్టు అధికార వర్గాల ద్వారా తెలిసింది. మంగళవారం నాడు మహిళలు ఉదయం నుంచి సచివాలయం వద్ద పడిగాపులు కాశారు. సచివాలయం సిబ్బంది వీఆర్వో కమల, బి శ్రీనివాస్, గాయత్రీ రిజిస్ట్రేషన్ విధానాన్ని నిర్వహించగా సర్పంచ్ మెండా ఝాన్సీ సురేష్‌బాబు పరిశీలించారు.

క్రైం కార్నర్

48 గంటల్లోనే నిందితుడి అరెస్టు..



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 6: నూజివీడు ఐటీఎస్ కంపెనీ కార్యాలయంలో నగదు చోరీ కేసులో నిందితుడిని నూజివీడు పట్టణ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. నూజివీడు డీఎస్పీ ఈ.అశోక్‌కుమార్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం నూజివీడు ఐటీఎస్ టెక్నో డ్యూ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఆదివారం బీరువా పగులకొట్టి నగదు చోరీ అయినట్టు కంపెనీ అకౌంటెంట్ రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా నూజివీడు పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి దర్యాప్తు చేపట్టి నూజివీడు మండలం తుక్కులూరు గ్రామానికి చెందిన కాగితాల జోసఫ్‌రాజును అరెస్ట్‌చేసి అతని నుంచి రూ.90 వేలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నేరం జరిగిన కేవలం 48 గంటల్లోనే నిందితుడిని అదుపులోకి తీసుకోవడం పై నూజివీడు పట్టణ పోలీసులను డీఎస్పీ అభినందించారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 6: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నూజివీడు మండలం మీర్జాపురంలో చోటుచేసుకుంది. మీర్జాపురంలో ద్విచక్రవాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో గొల్లపల్లికి చెందిన కంచర్ల రమేష్ (35) తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు నూజివీడు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే రమేష్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి.. నలుగురి అరెస్టు

కైకలూరు, ఫిబ్రవరి 6: చేపలచెరువుగట్లపై గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి నలుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 6500 స్వాధీనం చేసుకున్నట్లు కైకలూరు టౌన్ సీఐ ఆకుల రఘు తెలిపారు. కైకలూరు మండలం శ్యామలాంబపురంలో పోల్‌రాజ్ కాలువగట్టు వెంబడి ఉన్న చేపలచెరువుపై కోతముక్క ఆట నిర్వహిస్తున్నట్టు సమాచారం రావడంతో కైకలూరు టౌన్, మండవల్లి పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నలుగురు జూదరులను అరెస్టు చేసి 24 బైకులు, ఒక కారు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు.



చాట్రాయి పవర్‌పేట వద్ద ప్రమాదకర మలుపు



చాట్రాయిలో పాములపాటి ఇంటి వద్ద..

అధిక లోడు.. అతి వేగం

» ప్రమాదకర మలుపుల్లో దూసుకు వెళుతున్న వాహనాలు
» స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు నిల్
» చాట్రాయిలో ప్రజలు, వాహన చోదకులు బెంబేలు
» అధికారులు పట్టించుకోకపోవడంతో ఆగ్రహం

ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకునే కన్నా అది జరగకుండా చూడడం ఉత్తమం. మరి రహదారుల్లో అనేక ప్రమాదకర మలుపులున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇవిగో పై చిత్రాల్లోని మలుపులు చూస్తే ఎంత ప్రమాదకరంగా ఉన్నాయో తెలుస్తుంది. మరి అధికారులకు ఇవి కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

చాట్రాయి, జనవరి 6: మండల కేంద్రం చాట్రాయిలో పలు రోడ్డు మలుపులు ప్రమాదకరంగా మారటంతో వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. పవర్‌పేట, సచివాలయం, మెయిన్ సెంటర్, పాములపాటి నరసింహారెడ్డి ఇంటి సమీపాన మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఇది ఎన్టీఆర్-ఏలూరు జిల్లాలను కలిపే రహదారి కావటం, చింతలపూడి, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకి భారీ వాహనాలతో మెటల్ తరలిస్తుండటంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికి తోడు రోడ్లు బాగా ఇరుకుగా ఉండటం, మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించకపోవటం, అధికలోడు, అతివేగం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మలుపుల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం : ఆర్‌అండ్‌బీ డీఈఈ భాస్కరరావు

నిబంధనల ప్రకారం స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు అవకాశం లేదు, ఇక్కడ రోడ్లు ఇరుకుగా ఉండటం సమస్యగా ఉంది. ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు వంటి ముందు జాగ్రత్తలు తీసుకుంటాం. విస్సన్నపేట-వెలగలపల్లి రహదారి (వీవీ రోడ్డు) పరిధిలో నరసాపురం నుంచి చాట్రాయి మీదుగా తమ్మిలేరు ప్రాజెక్టు వరకు 15 కి.మీ. డబుల్ రోడ్డుగా విస్తరించటానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే సమస్యకు శాశ్వత పరిష్కారం లబిస్తుంది.



గృహ నిర్బంధం నోటీసు తీసుకున్న కాపా.. హౌస్ అరెస్ట్‌లో దాకరం సర్పంచ్ రాజా.. వెంకటాపురం సర్పంచ్ శ్రీనివాసరావు

అసెంబ్లీ ముట్టడికి వెళ్లనివ్వకుండా.. సర్పంచ్‌ల గృహ నిర్బంధం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 6: జగన్‌రెడ్డి పాలనలో గ్రామ స్వరాజ్యం నిర్వీర్యం అయిందని, నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్, నూజివీడు డివిజన్ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కాపా శ్రీనివాసరావు అన్నారు. పంచాయతీల ఖాతాల నుంచి తరలించిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను తిరిగి చెల్లించాలని కోరుతూ అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో కాపా శ్రీనివాసరావును పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. అసెంబ్లీ ముట్టడికి ఎటువంటి అనుమతులు లేవని, ఆందోళనకు అనుమతులు ఇవ్వలేదని పేర్కొంటూ కాపాను గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా కాపా మాట్లాడుతూ గ్రామస్వరాజ్యం తీసుకు వస్తానని నమ్మబలికిన జగన్ గ్రామస్వరాజ్యమే లేకుండా చేశాడని ఇందుకు ఆయన తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు.

ముదినేపల్లి: పంచాయతీరాజ్ చాంబర్ పిలుపు మేరకు మంగళవారం ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా ముదినేపల్లి మండలంలోని సర్పంచ్‌లను పోలీసులు నిరోధించారు. మండలంలోని పలువురు సర్పంచ్‌లను స్థానిక పోలీసులు ముందుగా అదుపులోకి తీసుకున్నారు. టీడీపీ సానుభూతిపరులైన దాకరం సర్పంచ్ జాస్తి రాజా, పెదపాలపర్రు సర్పంచ్ గంటా రాకేష్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన సర్పంచ్‌ల కదలికలపై హెడ్ కానిస్టేబుల్ రామారావు ఆధ్వర్యంలో పోలీసులు నిఘా పెట్టారు.

కలిదిండి: సర్పంచ్‌ల చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం సందర్భంగా వెంకటాపురం సర్పంచ్ గూడవల్లి శ్రీనివాసరావును సోమవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సర్పంచ్‌ల డిమాండ్‌లను పరిష్కరించాలని తలపెట్టిన ఛలో అసెంబ్లీ ముట్టడిని పోలీసులు అడ్డుకోవటం దారుణమన్నారు.

'అరాచక పాలనను అంతం చేయండి'

కలిదిండి, ఫిబ్రవరి 6 : ప్రజా సమస్యలను పరిష్కరించటంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం లోడిదలంక, మూల్లంక గ్రామాల్లో ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలనను అంతమొందించటానికి యువత సైనికుల్లా పాటు పడాలన్నారు. సమస్యలపై ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించి వేధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లంక గ్రామాల్లో ప్రధాన రహదారులు గోతులు పడి అధ్వానంగా ఉండడంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని, రహదారుల అభివృద్ధిలో వైసీపీ విఫలమైందన్నారు. సాగు, తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నా కాల్వలకు నీరు విడుదల చేయకపోవటం దారుణమన్నారు. భావితరాల భవిష్యత్ బాగుండాలంటే రాబోయే ఎన్నికల్లో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, నాయకులు సారిక వెంకటేశ్వరరావు, భోగేశ్వరరావు, బండి లక్ష్మీ, మంతెన సుబ్బరాజు, బండి తులసీరావు, తేరా రమేష్, జనసేన నాయకులు చనమల్ల చంద్రశేఖర్, నల్లగోపుల చలపతిరావు, కేశిరెడ్డి బలరామ్, కొల్లి బాబీ, బీజేపీ నాయకులు పైడిపాటి శివశంకర్, పేటేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్



సొమ్ము కోసం వచ్చిన డ్వాక్రా మహిళలతో బ్యాంకు కిటకిట

పక్కదారి పట్టిన సొమ్ము జమ

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 6: డ్వాక్రా సంఘాలకు బీసీ పాయింట్ల ద్వారా మోసపోయిన సొమ్ము మొత్తం రికవరీ జరిగింది. బిజినెస్ కరస్పాండెంట్లు సగ్గూరుకు చెందిన శైలజ, నరసింగపాలెంకు చెందిన అర్జున్‌రావు డ్వాక్రా సంఘాల వద్ద కోటి 9 లక్షలు మోసం చేయగా వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపారు. వీరి నుంచి సొమ్ము రికవరీ చేయలేక మధ్యవర్తి కంపెనీ ఇంటిగ్రా తన సొంత నిధులు రూ.90 లక్షలు నెల క్రితం ఎమ్మెల్యే ప్రతాప్ ఒత్తిడిపై ఖాతాదారులకు చెల్లించింది. మంగళవారం యూనియన్ బ్యాంకు జోనల్ ఆఫీస్‌లో ఇంటిగ్రా కంపెనీ అధికారులు ఎమ్మెల్యే ప్రతాప్, నరసింగపాలెం పీఏసీఎస్ ప్రెసిడెంట్ ఎర్రబాబు, సగ్గూరు సర్పంచ్ దిలీప్, బ్యాంకు అధికారులతో చర్చలు జరిపి మిగతా రూ.19 లక్షలు బ్యాంకులో జమ చేశారు.



సోమవారం చింతలపూడి చంద్రబాబు సభలో చాట్రాయి నాయకులు

'రా.. కదలి రా' సభతో టీడీపీ శ్రేణుల్లో జోష్

చాట్రాయి, ఫిబ్రవరి 6: చింతలపూడిలో జరిగిన చంద్రబాబు రా..కదిలిరా సభ మండలంలోని టీడీపీ శ్రేణుల్లో జోష్ నింపింది. మండల నాయకుల అంచనాలకు మించి టీడీపీ శ్రేణులు, అభిమానులు ప్రజలు చంద్రబాబు సభకు పోటెత్తటంతో నేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలానికి సరిహద్దునే చింతలపూడి పట్టణం ఉండటంతో అన్ని గ్రామాల నుంచి వందల సంఖ్యలో యువకులు, మహిళలు సభకు తరలివెళ్లటం విశేషం. వైసీపీ అస్తవ్యస్త పాలనకు విసిగిన అన్ని వర్గాల ప్రజలు టీడీపీకి అధికారం అప్పగించటానికి సిద్ధంగా ఉన్నారనటానికి చంద్రబాబు సభకు ప్రజల అనూహ్య స్పందనే నిదర్శనమని నాయకులు అంటున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి పీఠం అధిష్టిచటం ఖాయమని టీడీపీ, జనసేన నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



ముదినేపల్లిలో అస్తవ్యస్తంగా సర్వీస్ రోడ్డు



పెట్రోలు బంకు వద్ద అసంపూర్తి డ్రైన్ నిర్మాణం

సైకిల్ పైనా వెళ్లలేం!

» ఏడాదిగా పూర్తికాని డ్రైనేజీల నిర్మాణం
» ప్రమాదకరంగా సర్వీసు రోడ్లు

ముదినేపల్లి, ఫిబ్రవరి 6 : నంబరు 165 పామర్రు - దిగమర్రు జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ముదినేపల్లిలో పక్కా డ్రైన్ల నిర్మాణంలో జాప్యం జరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్య కూడలి ప్రదేశమైన ముదినేపల్లిలో జాతీయ రహదారికిరువైపులా ఉన్న సర్వీసు రోడ్లలో డ్రైన్ల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపైనే తవ్వేసిన గ్రావెల్ ఉండడంతో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సర్వీస్ రోడ్లలోనే బ్యాంక్, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, పాఠశాలలు ఉండటంతో వాహనాల రాకపోకలు ఎక్కువగా జరిగేవి. ఇప్పుడు ఇరువైపులా డ్రైన్ల నిర్మాణాలు సుమారు ఏడాది కాలంగా పూర్తి కాకపోవటంతో కనీసం సైకిల్‌పై వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా ఉందని ప్రజలు వాపోతున్నారు. విద్యార్థులు సర్వీసు రోడ్డులో నడవలేక రద్దీగా ఉండే ప్రధాన రహదారిపై పాఠశాలలకు వెళ్లాల్సి వస్తున్నది. సహకార బ్యాంకు వద్ద, పెట్రోల్ బంకు, స్టేట్ బ్యాంక్ తదితర ముఖ్యమైన ప్రదేశాల్లో డ్రైన్ల నిర్మాణం నిలిచిపోవటంతో వ్యాపార సంస్థలకు వెళ్లే మార్గం లేకుండాపోయింది. డ్రైన్ల నిర్మాణం పూర్తయితేనే సెంటర్‌లో రోడ్డు విస్తరణ పనులు చేపట్టే అవకాశం ఉంది. అప్పటి వరకు సర్వీస్ రోడ్లలో ఎదురుదెబ్బలు తింటూ నడవాల్సిందే.

దీనిపై ఎన్‌హెచ్ డీఈఈ సత్యనారాయణను వివరణ కోరగా, పలు కారణాలతో డ్రైన్ల నిర్మాణంలో జాప్యం జరిగిందని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

రేపు సర్వే అధికారులతో కమిషనర్ సమావేశం

నూజివీడు, ఫిబ్రవరి 6: సర్వే ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సమావేశానికి సర్వే అధికారులు సమాయత్తం కావాలని ఏలూరు జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి లక్ష్మణరావు అన్నారు. నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నూజివీడు డివిజన్ పరిధిలోని సర్వేయర్‌లతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడుతూ రీ సర్వే కార్యక్రమం కొనసాగుతున్న క్రమంలో సర్వే పూర్తయిన 47 గ్రామాలకు సంబంధించి రికార్డులన్నీ సరి చూసుకోవాలన్నారు. ఈ నెల 8న సర్వే ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సమావేశం ఉన్న నేపథ్యంలో సర్వే రికార్డుల్లో లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. డివిజనల్ సర్వేయర్లు వి.వరహాలరాజు, హుమాయూన్ బేగ్, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

రేపు చాట్రాయి మండల పరిషత్ సమావేశం

చాట్రాయి, ఫిబ్రవరి 6: చాట్రాయి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో మంగా కుమారి తెలిపారు. వ్యవసాయం, తాగునీరు, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, విద్యుత్, ఉపాధి హామీ తదితర అంశాలపై చర్చ జరుగుతుందని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

15న బలివే ఆలయంలో వేలం

ముసునూరు, ఫిబ్రవరి 6: బలివే రామలింగేశ్వర స్వామి ఆలయంలో నాలుగు రోజుల పాటు జరిగే మహాశివరాత్రి మహోత్సవాల్లో కొబ్బరి చెక్కలను పోగు చేసుకొనే హక్కు కోసం ఈ నెల 15న ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. దేవదాయ ధర్మదాయ శాఖ అధికాల పర్యవేక్షణలో వేలం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో ఆకుల కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 6: ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయ ధర్మకర్తలి మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఎటువంటి పోలీస్ కేసులు లేకుండా సేవాభావం కలిగిన వారు ధర్మకర్తలి మండలికి దరఖాస్తు చేసుకోవచ్చని ఈవో భవానీ తెలిపారు. 20 రోజుల్లోగా దరఖాస్తు చేయాలని ఈవో కోరారు.

కైకలూరు తహసీల్దార్‌గా పోతురాజు



కైకలూరు, ఫిబ్రవరి 6: కైకలూరు నూతన తహసీల్దార్‌గా ఎస్. పోతురాజు బాధ్యతలు చేపట్టారు. మంగళవారం కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. పోతురాజు కాకినాడ జిల్లా తాళ్లరేవు నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు కైకలూరులో తహసీల్దార్‌గా పనిచేసిన బి. మురళీకృష్ణ బదిలీపై తాడేపల్లిగూడెం వెళ్లారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్ పోతురాజు మాట్లాడుతూ కార్యాలయ సిబ్బంది సహకారంతో ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు.

ముదినేపల్లి తహసీల్దార్‌గా కుమారి



ముదినేపల్లి, ఫిబ్రవరి 6 : ముదినేపల్లి తహసీల్దార్‌గా ఎస్.ఎల్.ఎస్. కుమారి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల సంఘం మార్గదర్శక సూత్రాల మేరకు ఇక్కడి తహసీ ల్దార్ పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలానికి బదిలీ కాగా, సామర్లకోట నుంచి ముదినేపల్లి తహసీల్దార్‌గా కుమారి నియమితుల య్యారు. నూతన తహసీల్దార్‌ను ఎంపీపీ రామిశెట్టి సత్య నారాయణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు శీలం రామకృష్ణ తదితరులు అభినందించారు.

చెక్కపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడిగా లింగారావు



ముసునూరు, ఫిబ్రవరి 6: చెక్కపల్లి పీఏసీఎస్ నూతన అధ్యక్షుడిగా కాటేపల్లి వెంకట లింగారావు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. గత 12 ఏళ్లుగా ప్రస్తుత వైస్ ఎంపీపీ, లోపూడి గ్రామానికి చెందిన కోటగిరి రాజా అధ్యక్షుడిగా ఉన్నారు. అయితే చెక్కపల్లిలో ఒక వర్గం వైసీపీ నాయకులు అధ్యక్ష పదవిపై గట్టిగా పట్టుపట్టగా పంచాయితీ ఎమ్మెల్యే వద్దకు వెళ్ళింది. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అధ్యక్షుడిగా లింగారావును, మిగిలిన సభ్యులుగా స్వర్ణాల సుజాత, జాల ప్రభుదానును నియమించారు. నూతన అధ్యక్షుడు లింగారావును జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజా తదితరులు సత్కరించారు.

మండవల్లి పీఏసీఎస్ అధ్యక్షుడిగా బాబి



మండవల్లి, ఫిబ్రవరి 6: మండవల్లి వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా గుడివాడ సత్యవరప్రసాద్ (బాబి), డైరెక్టర్లుగా చొప్పరపు విజయ్, కుంచె చింతాలు బాధ్యతలను స్వీకరించారు. నూతన అధ్యక్షుడు బాబిని ఎంపీపీ పెద్దిరెడ్డి రాము, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, సర్పంచ్ మెండా ఝాన్సీ, వైసీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, గుడివాడ చిట్టిబాబు, ప్రొఫెసర్ విజయకుమార్ సత్కరించారు.

ఎన్ఆర్ఐ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ



ఆగిరిపల్లి, ఫిబ్రవరి 6: ఆగిరిపల్లి ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డీఎస్అండ్‌హెచ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డి.శ్రీనివాసులుకు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. వర్సిటీ గణితశాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యులు భవనారి సత్యనారాయణ పర్యవేక్షణలో గణితంలో ప్రాపర్టీస్ ఆఫ్ లైన్ గ్రాఫ్స్ అండ్ ప్రైమ్ గ్రాఫ్స్ బేస్డ్ ఆన్ అసోసియేటివ్ రింగ్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ లభించింది. ఎన్ఆర్ఐ కళాశాల చైర్మన్ డాక్టర్ ఆర్.వెంకట్రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.భాస్కర్‌రావు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జి.సాంబశివరావు, గణితశాస్త్ర విభాగాధిపతి ఎం.బాబు ప్రసాద్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది డాక్టర్ శ్రీనివాసును అభినందించారు.



బూరుగ్గూడెంలో వైద్య శిబిరం

వైద్య సేవలను వినియోగించుకోవాలి

చాట్రాయి, ఫిబ్రవరి 6: పట్టణాల్లో పెద్ద ఆసుపత్రుల నుంచి స్పెషలిస్ట్ డాక్టర్లు గ్రామాలకు వచ్చి అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి కోరారు. బూరుగ్గూడెం సచివాలయంలో మంగళవారం జరిగిన సురక్ష వైద్య శిబిరంలో ఏలూరు జీజీహెచ్ వైద్య నిపుణులు ఇ. శ్వేత (పీడియాట్రిక్), సుప్రియా చౌదరి (జనరల్ మెడిసిన్), నేత్ర వైద్య సహాయకుడు సురేంద్రబాబు, పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసులరెడ్డి, దుర్గాప్రసాద్ 326 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో మంగా కుమారి, ఈవోపీఆర్డీ మురళీకృష్ణ, సీహెచ్‌వో రమణ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

558 మందికి వైద్య పరీక్షలు

ముసునూరు, ఫిబ్రవరి 6: చింతలవల్లి సచివాలయంలో మంగళవారం నిర్వహించిన సురక్ష వైద్య శిబిరంలో 558 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు ముసునూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి షకీనా ఇవాంజలిన్ తెలిపారు. వైద్యపరీక్షలు, మందుల పంపిణీని ఎంపీడీవో పద్మావతిదేవి పరిశీలించారు. వైద్యులు డాక్టర్ కె.భవాని, డాక్టర్ పి.లావణ్య డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ ఇవాంజిలిన్ వైద్యపరీక్షలు నిర్వహించారు. 59 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ పిల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ పి.సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.